

### తొలగని ఉత్కంఠ
- గుకేశ్-డింగ్ పాయింట్లు సమం: నేడు 13వ రౌండ్
- ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

6

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 129 | విజయవాడ, బుధవారం 11 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 11 December 2024 | Rs



### అసాధారణ వేగంతో విస్తరిస్తున్న విశ్వం !
- నిర్ధారించిన వెబ్ టెలిస్కోప్ డేటా

3



పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు

## పర్యాటకంలో పెట్టుబడుల కోసం
# రాష్ట్రవ్యాప్తంగా భూ బ్యాంకులు

**భారీగా రాయితీలు • పిపిపి పద్ధతిలో ఏర్పాటు • పాలసీని విడుదల చేసిన ప్రభుత్వం**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఏర్పాటు చేసే టూరిస్టు ప్రాజెక్టుల కోసం భూములు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు నూతన టూరిజం పాలసీని ఆ శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ మంగళవారం విడుదల చేశారు. భూములతో పాటు, భారీగా రాయితీలు' స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో ఇవ్వనునన్నట్లు ఈ విధానంలో ప్రభుత్వం పేర్కొంది. 'పర్యాటక, ఆతిధ్యరంగంలో పెట్టుబడులు పెట్టేవారికి 'ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ'గా భూములు కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. దానిలో భాగంగా ఎటువంటి వివాదాలు లేని (ఎన్‌కంబరెన్స్ ఫ్రీ) భూ బ్యాంకులను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించి, ప్రత్యేక కేటాయింపులు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని ఈ 46 పేజీల విధానపత్రంలో ప్రభుత్వంలో పేర్కొంది. భూములతో పాటు భూ మార్పిడి చార్జీలు 100శాతం, స్టాంప్ డ్యూటీ 100శాతం మినహాయింపులు ఉంటుందని తెలిపింది. పరిశ్రమలకు అందించే విద్యుత్ టారిఫ్ ఈ ప్రాజెక్టులకు వర్తిసుందని, ఐదేళ్ల



పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయింపు ఉంటుందని వెల్లడించింది. ఏడేళ్ల పాటు రాష్ట్ర జిఎస్టి మినహాయింపు ఉంటుందని పేర్కొంది. రాష్ట్రస్థూల విలువ ఆధారిత(జివిఎ)పర్యాటక రంగ వాటాను 4.6శాతం నుంచి 8శాతం పెంచడం లక్ష్యమని పేర్కొంది. ఉద్యోగ కల్పన 12 నుంచి 15శాతానికి పెరుగుతుందని పేర్కొంది.

**ఎక్కడెక్కడ ఏవి?**

విశాఖపట్నం, అమరావతి (నాగార్జున కొండ)లను బుద్ధిస్ట్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయనుంది. విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ, నెల్లూరు, మచిలీపట్నం బీచ్ సర్క్యూట్‌లుగా పేర్కొంది. బీచ్ రిసార్ట్స్, విల్లాలను పిపిపి విధానంలో అభివృద్ధి చేయనుంది. అరకు-లంబసింగి, విశాఖపట్నం, రాజమండ్రి, కోనసీమ,విజయవాడ, శ్రీశైలం, గండికోట, తిరుపతి ప్రాంతాల్లో సి ప్లేన్ ప్రారంభించాలని నిర్ణయించింది.ఫిల్మ్ టూరిజం కోసం షూటింగ్ లోకేషన్లను గుర్తించాలని తెలిపింది. ప్రతి ఏటా నిర్వహించే ఈవెంట్లతో క్యాలెండర్ రూపొందించనుంది. ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో పర్యాటక పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి మహిళలు, పిల్లల కోసం మహిళా పోలీసులను ఏర్పాటు చేయాలని తెలిపారు. కొండపల్లి, కళంకరి, ఏలూరు కార్పెట్స్, ఉప్పాడ శారీ, బుదితి బ్రాస్‌వేర్ వంటి కళాలను పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ప్రమోట్ చేయాలని తెలిపింది. ఈ పాలసీ ఐదేళ్ల వరకు గానీ, కొత్త పాలసీ వచ్చే వరకు అమల్లో ఉంటుందని వెల్లడించింది. ఈ అన్ని ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపింది.

**ఇవి థీమ్‌లు...**

| | |
|---|---|
| బుద్దిస్ట్ సర్క్యూట్‌లు | 2 |
| టెంపుల్ సర్క్యూట్‌లు | 10 |
| బీచ్ సర్క్యూట్‌లు | 5 |
| రివర్ క్రూయిజ్ సర్క్యూట్‌లు | 4 |
| ఎకో టూరిజం సర్క్యూట్‌లు | 3 |
| సీ క్రూయిజ్ సర్క్యూట్‌లు | 2 |
| సీ ప్లేన్ సర్క్యూట్‌లు. | -- |

**ఆరు కేటగిరీలు**

టూరిజం ప్రాజెక్టుల కోసం ఆరు కేటగిరీలుగా పెట్టుబడులను ప్రభుత్వం ఆహ్వానించింది. కనీస పెట్టుబడిగా కోటి రూపాయలను నిర్ధేశించిన ప్రభుత్వం దానిని 'సూక్ష్మ' (మైక్రో) పెట్టుబడిగా పేర్కొంది. మూడు సంవత్సరాల్లో 250 నుండి 500 కోట్ల రూపాయలకు వరకు, నాలుగేళ్లలో 500 కోట్ల రూపాయల పైన పెట్టుబడులతో వచ్చే ప్రాజెక్టులను 'మెగా' 'అల్ట్రా మెగా' విభాగాలుగా గుర్తించి 'టైలర్ మేడ్'గా రాయితీలను అందిస్తామని తెలిపింది.

# ధన్‌ఖర్‌పై అవిశ్వాసం

## నోటీసు ఇచ్చిన ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. చైర్మన్ ఒంటెత్తు పోకడలపై ప్రతిపక్షాలు ఎప్పటి నుంచో ఫిర్యాదు చేస్తున్నాయి. ప్రస్తుత శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో చైర్మన్ హోదాలో నిష్పాక్షికంగా వ్యవహరించడానికి బదులు అధికార పార్టీ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు పదే పదే వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని పేర్కొన్నాయి. అందుకే ఆయనపై అవిశ్వాస తీర్మానం తెచ్చామన్నాయి. అవిశ్వాస తీర్మాన నోటీస్‌పై ఇండియా బ్లాక్‌కు చెందిన కాంగ్రెస్, టిఎంసి, సిపిఎం, ఆప్, ఎస్‌పి, డిఎంకె, ఆర్‌జెడి, సిపిఐ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపిలు సంతకాలు చేశారు. అనంతరం ఆ నోటీసును రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలోనే ఇదే మొదటిసారి. కాగా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే ఆయన మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని తెలిపారు. ఈ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానానికి ఆమోదం లభించడం సాంకేతికంగా సాధ్యం కాదని, 14 రోజుల నోటీస్ పీరియడ్ ఉండాలని, శీతాకాల సమావేశాలు ముగియడానికి ఇప్పుడు కేవలం 8 రోజులే ఉన్నాయని అధికార పార్టీకి చెందిన వారు చెబుతున్నారు.

**అదానిపై చర్చకు బిజెపి భయపడుతోంది**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. మంగళవారం ప్రారంభమైన ఉభయ సభలు నిమిషాల్లోనే నేటీ (బుధవారం)కి వాయిదా పడ్డాయి. లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. అయితే సభ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే వాయిదా పడ్డాయి. అదానీ వ్యవహారంపై ప్రతిపక్ష ఎంపిల ఆందోళనతో ఉభయ సభలు మధ్యాహ్నం 12 వరకు మిగతా 5లో

### త్వరలో క్రిస్మస్ కానుక
- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి
- అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పునరుద్ధరణకు చర్యలు
- రూ.340 కోట్లతో నూతన వసతి గృహాల నిర్మాణం 3లో..

### నేడు, రేపు కలెక్టర్ల సమావేశం
- 6 నెలల పాలనపై సమీక్షలు 3లో..

### పిపిపి విధానంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు
- స్పోర్ట్స్ పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం 2లో..

### పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- జనాభా ప్రాతిపదికన గిరిజన ప్రాంతానికి నిధులు కేటాయించాలి 3లో..


## జనన మరణాల నమోదుకు
# నూతన వెబ్ పోర్టల్

- జనవరి 1నుంచి అందుబాటులోకి
- మరో వెయ్యి సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు
- సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనన, మరణ ధ్రువపత్రాలు పొందడంలో తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు నూతన వెబ్‌పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన ఆర్‌టిజిఎస్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 జనవరి 1 నుంచి నూతన వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కుల ధ్రువీకరణ దగ్గర నుంచి ఆదాయ ధ్రువీకరణపత్రం, ఇతర పత్రాలను పొందేందుకు వాట్సాప్‌ను వేదికగా చేసుకునేలా ఈ వ్యవస్థ వుండాలని చెప్పారు. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్‌ను కొనసాగించాలన్నారు. వీలైనంత త్వరగా మరో వెయ్యి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయలని చెప్పారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్‌టిజిఎస్ సమీకృతం చేసి మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలన్నారు. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్'ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని సిఎం అధికారులకు నిర్దేశించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఎఐ), డీప్‌టెక్ వంటి సాంకేతిక సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధ్రువీకరించారని తెలిపారు. రానున్న రోజుల్లో వివిధ పంటల తెగుళ్లను గుర్తించేందుకు డ్రోన్లు వినియోగించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా? లేదా? అనేది సరిచూసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించి రూ.20 కోట్ల నిధుల మంజూరుకు సిఎం అనుమతిచ్చారు.



### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు
## కెఎం తివారీ ఇకలేరు

- సిపిఎం పొలిట్ బ్యూరో నివాళి
- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం సీనియర్ కేంద్ర కమిటీ సభ్యుడు కెఎం తివారీ (70) ఇకలేరు. మంగళవారం ఉదయం న్యూఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో ఆయన కన్నుమూశారు. ఆయన మృతికి సిపిఎం పొలిట్ బ్యూరో నివాళి అర్పించింది. నేడు (బుధవారం) నిగమ్ బోద్ ఘాట్‌లో అంత్యక్రియలు జరగనున్నాయి.సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు, ఢిల్లీ రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కెఎం తివారీ ఏడాది కాలంగా కేన్సర్‌కు చికిత్స పొందుతున్నారు. సోమవారం సాయంత్రం తీవ్రమైన మిగతా 5లో

## పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

- పొగమంచుతో అదుపుతప్పిన వాహనం
- తల్లి, ఇద్దరు కుమారులు మృతి



పంట కాలువలో దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి -పి.గన్నవరం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పొగమంచు అధికంగా ఉండడంతో అదుపుతప్పి పంట కాలువలోకి కారు దూసుకెళ్లడంతో తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందారు. పి.గన్నవరం మండలం ఊడిమూడి చింతవారిపేట వద్ద మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన నేలపూడి విజయ్‌కుమార్, తన భార్య ఉమ, కుమారులు మనోజ్, రిషిలతో కలిసి ఆదివారం విశాఖ జిల్లా అరకుకు కారులో విహార యాత్రకు వెళ్లారు. అనంతరం తిరిగి మంగళవారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. పి.గన్నవరం మండలం ఊడిమూడి చింతావారి పేటకు వచ్చే సరికి పొగమంచు ఎక్కువగా ఉండడంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు గల్లంతయ్యారు. విజయ్‌కుమార్ ప్రాణాలతో బయటపడ్డారు. ఒడ్డుపైకి వచ్చి కేకలు వేయగా స్థానికులు వచ్చి రక్షించే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కారుకు కొంత దూరంలోనే ఉమ (34), మనోజ్ (9), రిషి (7) మృతదేహాలను వెలికితీశారు. వాటిని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనపై స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని తెలిపారు.

# మరో 8,821 కోట్ల పనులు

## సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.8,821.44 కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం సిఆర్‌డిఎ అథారిటీ 42వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ మీడియా ప్రతినిధులకు వివరించారు. ల్యాండ్ పూలింగ్ లే అవుట్‌లలో రోడ్లకు రూ. 3,807 కోట్లు, ట్రంకు రోడ్లకు రూ.4,521 కోట్లు, జడ్జిలు, మంత్రుల భవన సముదాయాలు పూర్తి చేసేందుకు రూ.492 కోట్లతో పనులు చేపట్టేందుకు అథారిటీ అనుమతిచ్చిందని చెప్పారు. 41వ అథారిటీ సమావేశంలో ఇచ్చి అనుమతితో కలుపుకుంటే ఇప్పటి వరకు రూ.20,292.46 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు ఆమోదముద్ర పడిందని మంత్రి తెలిపారు. నేలపాడు, రాయపూడి, అనంతవరం, దొండపాడు వంటి గ్రామాల్లో 236 కిలో మీటర్ల మేర లే అవుట్ రోడ్లకు అనుమతి లభించిందని చెప్పారు. రాజధానిలో మొత్తం 360 కిలో మీటర్ల మేర ట్రంక్ రోడ్లు ఉండగా వీటిలో 97.50 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి తాజా సమావేశంలో అనుమతి లభించినట్లు వివరించారు. ఈ నెల 16న జరిగే అథారిటీ సమావేశంలో మరికొన్ని పనులకు ఆమోదం తీసుకుంటామని, ఇప్పటికే ఆమోదించిన పనులకు 15వ తేదీ నాటికి టెండర్లను పిలవడం జరుగుతందని తెలిపారు. ఈ నెలాఖరుకు టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తి చేస్తామన్నారు. సింగపూర్ వారిపై గత ప్రభుత్వం కేసులు పెట్టిందని, తిరిగి వారిని అమరావతికి తీసుకువచ్చే అంశంపై సిఎం నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఈ పనుల కోసం ఉత్తర్వులు**

గత సమావేశంలో సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదించిన రూ.11,467.27 కోట్ల పనులు చేపట్టడానికి మంగళవారం పురపాలక శాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో చేపట్టనున్న ఈ పనుల్లో ముఖ్యంగా గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, అపార్ట్‌మెంట్లు, ఐఎఎస్ అధికారులు, శాసన సభ, శాసన మండలి సభ్యులు నివాసాలు, న్యాయమూర్తులు, మంత్రులు, ఐఎఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం ఉన్నాయి.



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం

## 300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పొదిలి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా పొదిలిలో ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...పొదిలి పట్టణం మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలోని ధనలక్ష్మి రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారని ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో కనిగిరి ఆర్‌డిఒ కేశవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రైస్ మిల్లుపై అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 300 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దుకు అసెంబ్లీలో తీర్మానం

- ఎపిసిపిఎస్‌ఇఎ సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి డిమాండ్



మాట్లాడుతున్న గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలని తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ శాసనమండలి సభ్యునిగా నూతనంగా ఎన్నికైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిసిపిఎస్‌ఇఎ) ఆధ్వర్యాన విజయవాడలోని ధర్నా చౌక్‌లో మంగళవారం సభ జరిగింది. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి గోపిమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని, ఆ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని అన్నారు. సిపిఎస్ రద్దు కోసం జరిగే పోరాటానికి పిడిఎఫ్ అండగా ఉంటుందని చెప్పారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ నిర్వహించిన పాదయాత్ర, మోటార్ సైకిల్ ర్యాలీలలో తాను పాల్గొన్నానని వివరించారు. భవిష్యత్తులో సిపిఎస్ రద్దుకోసం జరిగే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటానని వెల్లడించారు. సిపిఎస్ ఉద్యోగుల గళాన్ని శాసనమండలిలో కూడా వినిపించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు సిపిఎస్‌ను కేంద్ర రద్దు చేస్తుందో, రాష్ట్రం రద్దు చేస్తుందో తేల్చుకోవాలని చెప్పారు.తమకు మాత్రం ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసేందుకు ఆలోచన చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా హామీ ఇచ్చారని, ఇందుకు అనుగుణంగా సిఎం, మంత్రులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎపిజెఎసి చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులను న్యాయం చేయాలని కోరారు. ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి హృదయరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను తొలగిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. ఎపిసిపిఎస్‌ఇఎ అధ్యక్ష కార్యదర్శులు సతీష్, సిఎం దాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తక్షణమే చర్చలను జరిపి తమకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చేయాలని కోరారు. ఎస్‌టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి, ఎపిజిఇఎ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్‌రాజు, ఆస్కారావు, ఎపి సచివాలయం సిపిఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోట్ల రాజేష్, ఎపిటిఎఫ్ 257 ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జానీభాషా తదితరులు ఈ సభకు మద్దతు తెలిపారు.



## 3 రాజ్యసభ సీట్లకు 9 నామినేషన్లు

- ముఖ్యమంత్రితో ముగ్గురు అభ్యర్థుల భేటీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు మంగళవారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి 9 నామినేషన్లు దాఖలయ్యాయి. దరఖాస్తులను టిడిపి, బిజెపి అభ్యర్థులు.. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితారాణికి అందజేశారు. బీద మస్తాన్‌రావు, సానా సతీష్, ఆర్ కృష్ణయ్య రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. వీరికి మద్దతుగా పోటీలో నిలబడే అభ్యర్థుల కుటుంబ సభ్యులతో డమ్మీ సెట్లను వేయించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన వెంటనే ముగ్గురు అభ్యర్థులు సిఎం చంద్రబాబును కలిసి తమకు రాజ్యసభకు పోటీచేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబరు 20న ఈ ఉప ఎన్నిక జరగనుంది. అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు. ప్రతిపక్షం నుంచి ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఈ ఎన్నిక లాంఛనమే.

## 17న రాష్ట్రానికి రాష్ట్రపతి రాక

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17న రాష్ట్రానికి రానున్నారు. మంగళగిరిలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మొదటి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అందుకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు గురించి సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం ఏ చిన్నపాటి పొరపాట్లకు ఆస్కారం లేని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ ఆదేశించారు. రాష్ట్రపతి 17న ఉదయం 11:20 గంటలకు భారత వాయుసేన విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని సిఎస్ తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 12:05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. అనంతరం తిరిగి గన్నవరం విమానాశ్రయానికి వెళతారని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబుతో పాటు కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు ఏర్పాట్ల గురించి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిజిపి హాజరై బందోబస్తు ఏర్పాట్ల గురించి సిఎస్‌కు వివరించారు. గన్నవరం విమానాశ్రయ డైరెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## సజ్జలకు మరోసారి ఊరట

**ప్రజాశక్తి-అమరావతి**

టిడిపి ఆఫీసుపై దాడి చేశారంటూ మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. సజ్జలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని గతంలోని ఉత్తర్వులను ఈ నెల 24 వరకు మరోసారి హైకోర్టు పొడిగించింది.

## రెండోరోజూ కొనసాగిన కడప ఎంపి పిఎ విచారణ

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి విచారణ రెండోరోజూ కొనసాగింది. మొదటి రోజైన సోమవారం కడప సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. రెండవ రోజైన మంగళవారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పోలీసులు విచారించారు. విచారణ అనంతరం మీడియాతో రాఘవరెడ్డి మాట్లాడుతూ.. పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుపై యాంటీస్పేటర్ బెయిల్ నిమిత్తం హైకోర్టును ఆశ్రయించానన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసు విచారణకు హాజరయ్యానని తెలిపారు. పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు పోలీసులు 41 నోటీసులు జారీ చేయడంతో విచారణకు హాజరయ్యానన్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సహకరించానని తెలిపారు. విచారణలో భాగంగా మూడవ రోజైన బుధవారం మరోసారి విచారణకు హాజరు కావాలని కోరుతూ 41 నోటీసులు జారీ చేశారన్నారు. బుధవారం మరోసారి విచారణకు హాజరవుతానని తెలిపారు.

## ప్రతి నియోజకంలో ఒక మోడల్ కాలనీ: మంత్రి పార్థసారథి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ కాలనీని అభివృద్ధి చేయాలని అధికారులను గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. రాష్ట్రంలోని గృహ నిర్మాణాల పురోగతిపై మంగళవారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్న కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రహదారులు, మంచినీరు, విద్యుత్తు, డ్రెయినేజీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సిఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు ప్రయత్నం చేస్తానన్నారు. ప్రస్తుతం ప్రతి లబ్ధిదారునికి తక్కువ వడ్డీకి ఇస్తున్న రూ.35 వేల రుణాన్ని రూ.లక్షకు పెంచేలా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. పిఎంఎవై-2 పథకం కింద ఇళ్లు నిర్మించడానికి కేంద్రంతో ఒప్పందం పూర్తయ్యిందని, లబ్ధిదారులను ఎంపిక చేయడానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పెద్ద కాలనీల్లో డ్రోన్ల ద్వారా ఇళ్ల నాణ్యతను పరిశీలించాలన్నారు.

# పోరాటాలకు సిద్ధం కండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి
- ముగిసిన సిపిఎం నంద్యాల జిల్లా మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్/నందికొట్కూరు టౌన్**

ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రజలను సిద్ధం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ప్రారంభమైన సిపిఎం నంద్యాల జిల్లా మహాసభ మంగళవారం ముగిసింది. మహాసభ ముగింపు సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి విశాల ఐక్యవేదికను ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలోని ప్రమాదకర శక్తులను ఎదుర్కొనేందుకు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై ట్రూ అప్ పేరుతో విద్యుత్ ఛార్జీల భారాలు మోపుతోందని, ప్రజల ఆగ్రహం చవి చూడకముందే ఈ పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధికి, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. బిజెపి మతోన్మాదాన్ని ఛాలెంజ్ చేసేది కమ్యూనిస్టు పార్టీలేనని, పాలకులు రకరకాల పేరుతో యువతను, ప్రజలను వారి వైపు తిప్పుకుంటున్నారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను గాలికి వదిలేసిందని తెలిపారు. మహాసభను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గపూర్ పరిశీలించారు.

### 16 తీర్మానాలకు ఆమోదం

మొత్తంగా 16 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది. జిల్లా సమగ్రాభివృద్ధికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. సాగు, తాగు నీటి సమస్యలపైన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించాలని, మెట్ట భూములకు సాగునీరు ఇవ్వాలని, నంద్యాల పట్టణంలోని మద్దిలేరు, కుందూ నది, చామకాల్వ వెంట రక్షణ గోడ నిర్మించి, వరద ముంపు నుంచి నంద్యాల పట్టణ ప్రజలను కాపాడాలని, పలు తీర్మానాలను మహాసభ డిమాండ్ చేసింది.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు రణధీర్, షేబారాణి, కెఎండి గౌస్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

### జిల్లా కార్యదర్శిగా టి.రమేష్ కుమార్



21 మంది సభ్యులతో జిల్లా కమిటీ ఎన్నికైంది. సిపిఎం జిల్లా కార్యదర్శిగా టి.రమేష్ కుమార్‌ను మరోసారి ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా నాగరాజు, వి.ఏసు రత్నం, ఎం.నాగేశ్వరరావు, టి.రామచంద్రుడు, నరసింహనాయక్ ఎన్నికయ్యారు.

## పారిశ్రామిక ప్రమాదాల నివారణకు వసుధా మిశ్రా కమిటీ

- మంత్రి వాసంశెట్టి సుభాష్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కార్మికుల భద్రతకు, సంక్షేమానికి, ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు వసుధా మిశ్రా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ త్వరలోనే నివేదిక అందజేస్తుందని, దీని ఆధారంగా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజధాని అమరావతిలో 500 పడకల ఆస్పత్రికి, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఇఎస్‌ఐ ఆస్పత్రుల ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో 96 డిస్పెన్సరీలు, 4 ప్రాంతీయ ఆస్పత్రులు, 4 డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. గతంలో సేఫ్టీ ఆడిటింగ్ ఏజెన్సీలు కలెక్షన్ ఏజెన్సీలుగా మారిపోయాయని, పరిశ్రమలపై తప్పుడు కేసులు నమోదు చేసి భారీ స్థాయిలో డబ్బులు గుంజే యత్నం చేశాయని విమర్శించారు. అలాగే కర్మాగార, భవన నిర్మాణ కార్మికులకు అన్ని విధాలుగా సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని, వారికి చట్టం ప్రకారం అందాల్సిన ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు.

## జల్‌పల్లి ఇల్లు నా కష్టార్జితం... మనోజ్‌కు సంబంధం లేదు

- మోహన్‌బాబు ఆడియో సందేశం

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

కొన్ని కారణాల వల్ల తన కుమారుడు, తాను ఘర్షణ పడ్డ విషయం నిజమేనని సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు పేర్కొన్నారు. తన కుటుంబంలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన మంగళవారం రాత్రి ఆయన ఆడియో సందేశం విడుదల చేశారు. 'మనోజ్ నువ్వు నా బిడ్డవి. నువ్వు ఈరోజు నా గుండెల మీద తన్నావ్. నా మనసు ఆవేదనతో కుంగిపోతోంది. నా పరువు ప్రఖ్యాతలు మంటగలిపావు. జల్‌పల్లి ఇల్లు నా కష్టార్జితం మనోజ్‌కు సంబంధం లేదు. నా ఇంట్లో అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు. మనోజ్ నీవల్ల మీ అమ్మ ఆస్పత్రిలో చేరింది. భార్య మాటలు విని తాగుడుకు అలవాటు పడ్డావు. తప్పు చేయనని చెప్పి మళ్లీ ఇంట్లోకి వచ్చావు. నా ఫిర్యాదుపై పోలీసులు స్పందించ లేదు. న్యాయం, ధర్మంగా నడుచుకోవాలి. మనోజ్ వచ్చి తన బిడ్డను తీసుకెళ్లొచ్చు. రాకపోతే ఆ బిడ్డను జాగ్రత్తగా పెంచుతా. ఆస్పత్రి నుంచి మీ అమ్మ డిశ్చార్జ్ అయిన తర్వాత పోలీసుల సమక్షంలో నీకు అప్పగించమని చెబుతా..ఇంతటితో గొడవకు ముగింపు పలుకుదాం' అని మనోజ్‌కు పంపిన ఆడియో సందేశంలో పేర్కొన్నారు.

### మోహన్‌బాబు నివాసం వద్ద ఉద్రిక్తత : మీడియా ప్రతినిధులపై ఆగ్రహం

జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. మనోజ్ దంపతులు మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా, సెక్యూరిటీ భద్రతా సిబ్బంది గేట్లు తీయకపోవడంతో 'నా కుమార్తె లోపల ఉంది' అంటూ మనోజ్ అక్కడి భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్లు తోసుకుని లోపలికి దూసుకెళ్లారు. మనోజ్ వెంట వచ్చిన బౌన్సర్లను పోలీసులు బయటకు పంపించేశారు. దాడి జరగడంతో చిరిగిన చొక్కాతో మనోజ్ బయటకు వచ్చారు. ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హామీలు వెంటనే అమలు చేయాలి

- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

**ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి**

ఎన్నికల సమయంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాకినాడలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైసిపి నాయకులు సమీక్షా సమావేశం కాకినాడ సూర్యకళా మందిరంలో ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ. 20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేసిందన్నారు. మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదని తెలిపారు. దళారులే తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను దోచుకుంటున్నారన్నారు. పంట బీమాను పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మంత్రి పట్టుకున్న బియ్యం మళ్లీ నౌకలోకి ఏలా వెళ్లాయని, ప్రభుత్వం ప్రమేయం లేకుండా నౌకలోకి రేషన్ బియ్యం వెళ్తాయా? అని ప్రశ్నించారు. విశాఖపట్నం పోర్టులోని కంటైనర్‌లో పట్టుకున్న రేషన్ బియ్యం టిడిపి నేతవే అని తేటతెల్లమైందన్నారు. గతంలో విశాఖకు 25 వేల కేజీల డ్రగ్స్ వచ్చిందన్నారని, ఇప్పుడు అవి డ్రగ్స్ కాదని తేల్చారన్నారు. ప్రజా స్వామ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏలా అపహస్యం చేస్తుందో రాజ్యసభ సభ్యుల ఎన్నిక చూస్తే అర్థమవుతోందని విమర్శించారు. ఒక్క రూపాయి కూడా విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు సర్దుబాటు పేర రూ. వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోనే చంద్రబాబు మాట మార్చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేకుంటే వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## పిపిపి విధానంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు

- స్పోర్ట్స్ పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను, క్రీడా వసతులను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో అభివృద్ధి చేసేలా స్పోర్ట్స్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ పాలసీకు సంబంధించి యువజన, క్రీడల శాఖ కార్యదర్శి వినయ్ చంద్ జిఓ 18ను మంగళవారం విడుదల చేశారు. ప్రైవేట్ పాత్ర పెంచేందుకు బిల్డ్-ఓన్-ఆపరేట్ (బిఒటి) విధానాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా ప్రైవేట్‌దారులు నిర్మించి క్రీడాకారుల నుంచి వసూలు చేసుకునే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్టేడియాలు, శిక్షణ వసతులు వంటి వాటిని పిపిపి విధానంలో ఏర్పాటు చేస్తామని ఉత్తర్వుల్లో తెలిపింది. ఇప్పటికే ఉన్న క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనిని ప్రైవేట్‌దారులకు పదేళ్లపాటు లీజుకు అప్పగిస్తామని పేర్కొంది. పిపిపి విధానంలో క్రీడా అకాడమీ ఏర్పాటు చేస్తామని తెలిపింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో క్రీడాకారుల కోసం క్రీడా వికాస కేంద్రాలను పూర్తిచేస్తామని పేర్కొంది.

శాప్ ఆధ్వర్యంలో 4-6 ఏళ్ల పిల్లలకు నర్సరీ స్థాయిలో స్విమ్మింగ్, జిమ్నాస్టిక్ పాఠశాలలు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని తెలిపింది. రాజధాని అమరావతిలో ప్రతిపాదించిన స్పోర్ట్స్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలను శాప్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామని పేర్కొంది. ప్రభుత్వ నియామకాల్లో 3 శాతం స్పోర్ట్స్ కోటాగా పేర్కొంది. వీటితోపాటు అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో గెలుపొందిన, పాల్గొన్న క్రీడాకారులకు అందించే నగదు వివరాలను వెల్లడించింది.

## రామ్‌గోపాల్‌వర్మకు ముందస్తు బెయిల్

**ప్రజాశక్తి-అమరావతి**

సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు హైకోర్టులో ఊరట లభించింది సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టారంటూ పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో వర్మకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. అనకాపల్లి జిల్లా, రావికమతం, గుంటూరు జిల్లా, తుళ్లూరు, ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వీటికి సంబంధించి ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వర్మ వేసిన కేసులో జస్టిస్ ఎన్ హరినాథ్ మంగళవారం తీర్పు చెప్పారు. 'రూ.10 వేల చొప్పున రెండు స్వీయ పూచికత్తులు సమర్పించాలి. దర్యాప్తునకు సహకరించాలి. పోలీసులు కోరినప్పుడు విచారణకు అందుబాటులో ఉండాలి' అని షరతులు విధించారు.

### హోంమంత్రిపై చెక్‌బౌన్స్ కేసు కొట్టివేత

హోంమంత్రి అనితపై విశాఖపట్నం కోర్టులోని చెక్‌బౌన్స్ కేసును హైకోర్టు కొట్టేసింది. మంగళవారం కేసు విచారణకు హోంమంత్రి అనిత, ఫిర్యాదుదారుడు వేగి శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనిత తరపున న్యాయవాది వివి సతీష్ వాదిస్తూ.. చెక్‌బౌన్స్ కేసును రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారుడు వేగి శ్రీనివాసరావు, హోంమంత్రి నిర్ణయించుకున్నారన్నారు. రాజీలో భాగంగా రూ.10 లక్షలు వేగి శ్రీనివాసరావుకు అందజేసినట్లు చెప్పారు. మరో రూ.5 లక్షలు చెక్కు రూపంలో వేగి శ్రీనివాసరావు తరపున న్యాయవాదికి అందజేస్తున్నామన్నారు. మంత్రి అనిత, శ్రీనివాస్‌రావు కేసును రాజీ చేసుకున్నట్లు చెప్పడంతో హైకోర్టు, విశాఖపట్నం కోర్టులో ఉన్న చెక్‌బౌన్స్ కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. తన వద్ద రూ.70 లక్షలు తీసుకున్న అనిత ఆ మేరకు చెక్కులు ఇచ్చారని, డబ్బులు తిరిగి ఇవ్వలేదని శ్రీనివాసరావు కింది కోర్టులో కేసు వేశారు. ఈ కేసులో ఇద్దరూ రాజీ చేసుకున్నామని, కింది కోర్టు కేసును కొట్టేయాలని హైకోర్టును అనిత ఆశ్రయించారు. ఇరుపక్షాలను విచారించాక హైకోర్టు కింది కోర్టులోని కేసును కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది.

### ఎస్‌సి వర్గీకరణ అధ్యయన కమిషన్‌పై పిటిషన్

ఎస్‌సి వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు ఉందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యాన ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 'జాతీయ ఎస్‌సి కమిషన్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చట్టబద్ధత లేదు. దీనిని కొట్టేయాలి' అని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ జరిపారు. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేశారు. ఈ కేసులో తమను ప్రతివాదులుగా చేర్చేందుకు అనుమతించాలంటూ పలువురు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్లపై అదేరోజు నిర్ణయం తీసుకుంటామన్నారు.

## డంపింగ్ యార్డులు లేకుండా చేస్తాం: నారాయణ

**ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి**



జిందాల్ కంపెనీలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును పరిశీలిస్తున్న మంత్రి

వచ్చే అక్టోబరు 2 నాటికి వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. గుంటూరులోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ విద్యుత్ ప్లాంట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వచ్చే ఏడాది గాంధీ జయంతి నాటికి డంపింగ్ యార్డులు లేకుండా సమర్థవంతంగా వ్యర్థాలను నిర్వహణ చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల నిర్వహణ బాగుందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజు 6890 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి జరిగితే అందులో ఉమ్మడి గుంటూరు, విశాఖపట్నంలో జిందాల్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్లాంట్ ల్లో 2160 టన్నుల వ్యర్థాలను (31 శాతం) ట్రీట్మెంట్ చేస్తున్నారన్నారు. ప్లాంట్ల పరిధిలోని 50 నుండి 60 కిలోమీటర్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయితీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. త్వరలో కాకినాడ, నెల్లూరులో కడప, కర్నూల్, అనంతరపురం దగ్గర వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోయే మూడేళ్ల కాలంలో రాష్ట్రంలోని 123 మునిసిపాల్టీల్లో సాలిడ్, లిక్విడ్ వేస్ట్ నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద షెడ్లు వద్దు

**ముఖ్యమంత్రికి కెవిపిఎస్ లేఖ**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం చుట్టుపక్కల వ్యాపార లావాదేవీలకు ఎలాంటి షెడ్లు, బిల్డింగ్స్ ఏర్పాటు చెయ్యకుండా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మంగళవారం లేఖ రాశారు. అంబేద్కర్ విగ్రహం, డిజిటల్ లైబ్రరీ, రిసెర్చ్ సెంటర్ ఎంతో అపురూపమని తెలిపారు. దీనిని ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రజల ఆకాంక్షించారని పేర్కొన్నారు. ఇప్పుడు అలా కాకుండా తూర్పు వైపున ఉన్న ఖాళీ స్థలంలో డ్వాక్రా బజారు కోసం ప్రభుత్వం షెడ్లు ఏర్పాటు చేయడం సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

## కేర్ హాస్పిటల్‌లో దారుణం

- స్కానింగ్ సెంటర్‌లో మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

**ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

విశాఖ రామ్‌నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న కేర్ ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది. స్కానింగ్ సెంటర్‌లో.. మహిళకు స్కానింగ్ తీసే సమయంలో.. స్కానింగ్ తీసే వ్యక్తి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి స్నేహితుల కథనం ప్రకారం.. సిరిపురం జంక్షన్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సదరు మహిళ గాయపడ్డారు. ఆమెను హుటాహుటిన కేర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. తలకు గాయం కావడంతో ఆమెకు స్కానింగ్ చేయాలని వైద్యులు సిఫార్సు చేశారు. దీంతో ఆసుపత్రి మొదటి అంతస్తులో ఉన్న స్కానింగ్ సెంటర్‌కు ఆమెను తీసుకువెళ్లారు. అక్కడ పనిచేస్తున్న వ్యక్తి ప్రకాష్ స్కానింగ్ తీసేందుకు శరీరంపై ఉన్న వస్త్రాలను తొలగించాలని ఆమెకు చెప్పాడు. అసభ్యకరంగా ప్రవర్తించాడు. తలకు గాయమైనప్పుడు వస్త్రాలు తీయాల్సిన పనిలేదని ఆమె చెప్పినప్పటికీ పట్టించుకోకుండా ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలు కేకలు వేశారు. దీంతో ఆమెను హాస్పిటల్‌కు తీసుకువచ్చిన యువకులు, అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. స్కానింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న ప్రకాష్‌ను చితకబాదారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించారు. నిందితుడు ప్రకాష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రస్తుతం నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. ఇంత జరిగినప్పటికీ కేర్ హాస్పిటల్ యాజమాన్యం మౌనంగా ఉండడం పట్ల ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### స్పందించిన సిఎం

స్కానింగ్ సెంటర్‌లో మహిళను వేధింపులకు గురిచేసిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

## పోలవరం నిర్వాసితులకు న్యాయమెప్పుడు?

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ




సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

**ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న నిర్వాసిత కుటుంబాలకు ఎప్పటికి న్యాయం చేస్తారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఏడు ముంపు మండలాల నిర్వాసితులతో మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వాసితుల మహాసదస్సు నిర్వహించారు. రామకృష్ణతోపాటు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి సాగుతున్న సర్వేలతో నిర్వాసితుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని వాపోయారు. కాంటూరు లెక్కలన్నీ తప్పుల తడకలని విమర్శించారు. పదేళ్ల క్రితం చేసిన సర్వేలతో, కటాఫ్ తేదీలతో నిర్వాసితులకు న్యాయం జరగదన్నారు. ముందుగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి ఆ తర్వాత ప్రాజెక్టు పనులు చేపట్టాలని ప్రభుత్వాలకు సూచించారు. వివాదం లేని భూములను గిరిజనులకు ఇవ్వాలని, కటాఫ్ తేదీలతో సంబంధం లేకుండా నిర్వాసితులను తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు జిరాయితీ భూములు మాదిరిగానే నష్టపరిహారం ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. సదస్సులో జాతీయ సమితి సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎపిజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వివిధ సంఘాల జిల్లా నేతలు వేలేరుపాడు, కుక్కునూరు, కూనవరం, విఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల నేతలు పాల్గొన్నారు.

## పటిష్టంగా 15 సూత్రాల కార్యక్రమం అమలు : షాహెజాది

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

15 సూత్రాల కార్యక్రమాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని లైన్ డిపార్టుమెంట్ అధికారులను జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాహెజాది ఆదేశించారు. రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలు తీరును సమీక్షించేందుకు సచివాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మైనార్టీ బడ్జెట్‌ను వారి సంక్షేమానికే వినియోగించాలన్నారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద చేపట్టిన పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, వసతి గృహాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇతరులతో సమానంగా ఐసిడిఎస్ సేవలు మైనార్టీలకు అందేలా చూడాలన్నారు. ఉర్దూ భాషను ప్రోత్సహించడానికి ఎక్కువ అవకాశాలు కల్పించాలని, మదర్సా విద్యను ఆధునీకరించాలన్నారు. ఈ వర్గాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించాలని, మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా విద్యా, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆదేశించారు. మతపరమైన అల్లర్ల బాధితులకు పునరావాసం కల్పించాలని సూచించారు. తొలుత రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ చిత్తూరి శ్రీధర్, మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్రం అమలు చేస్తున్న పలు పథకాల పురోగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి కె హర్షవర్ధన్, వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షరీన్ బేగం, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు విద్యార్థిని మృతి

- ప్రమాదానికి ఎవరూ కారకులు కాదు : నంద్యాల ఎస్‌పి

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి సోమవారం తెల్లవారు జామున ఇంటర్ విద్యార్థి లహరి మృతి చెందారని, ఆమెను ప్రేమించిన ఆకుల రాఘవేంద్ర కాలిన గాయాలతో బయటపడి ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని నంద్యాల జిల్లా ఎస్‌పి అధిరాజ్ సింగ్‌రాణా తెలిపారు. మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన లహరి రెండేళ్ల నుంచి నంద్యాల జిల్లా నందికొట్కూర్ బైరెడ్డినగర్‌లోని తాత ఇంటిలో ఉంటూ ఇంటర్ చదువుతున్నారు. వెల్దుర్తి మండలం కలుగొట్లకు చెందిన బోయ ఆకుల రాఘవేంద్రతో లహరి చనువుగా ఉంటోందన్నారు. ఆదివారం రాత్రి దోమలకు జెట్ కాయిల్ అంటించుకొని ఇద్దరూ స్టోర్ రూమ్‌లో నిద్రిస్తుండగా పెయింటింగుకు వాడే టిన్నర్ ఆయిల్ ప్రమాదవశాత్తు కిందపడిందని, టిన్నర్ ఆయిల్ జెట్ కాయిల్‌కు తగలడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయని చెప్పారు. లోపల గడియ వేసి ఉన్నందున బయటకు రాలేక శరీరమంతా కాలిపోయి లహరి మరణించారని తెలిపారు. ఇది ప్రమాదవ శాత్తు జరిగిందని, ఎవరి ప్రమేయం గాని, కుట్ర గాని లేదని ఎస్‌పి తెలిపారు.

### మహిళలపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలి: శ్రామిక మహిళా సంఘం

మహిళలు, బాలికలపైన జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి, జిల్లా అధ్యక్షులు నిర్మల డిమాండ్ చేశారు. పట్టణంలో మైనర్ బాలికపై జరిగిన సంఘటనను నిరసిస్తూ మంగళవారం నిరసన తెలిపారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం గాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

## 'అనంత'లో ఫుడ్ కమిషన్ ఛైర్మన్ తనిఖీలు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం జిల్లాలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు రోజుల పర్యటన సందర్భంగా ఆయన జిల్లాకు విచ్చేశారు. మంగళవారం తాడిపత్రి, నార్పల, బుక్కరాయసముద్రం మండలాల్లోని పలు పాఠశాలలు, కెజిబివిలు, బిసి వెల్ఫేర్ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం ఇవ్వకుంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే అన్నింటినీ సక్రమంగా ఇవ్వాలని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ల సిబ్బందిని ఆదేశించారు.

## నేడు, రేపు కలెక్టర్ల సమావేశం

- 6 నెలల పాలనపై సమీక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఈ నెల 11, 12 తేదీల్లో సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలతో పలు అంశాలపై అధికారులతో సిఎం దిశా నిర్దేశం చేయనున్నారు. రానున్న నాలుగున్నరేళ్లలో ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అంశాలపైనా ఈ సమీక్షా సమావేశాల్లో చర్చించనున్నారు. 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల హెచ్‌ఒడిల నుంచి శాఖలవారీ అభిప్రాయాలను సిఎం తెలుసుకోనున్నారు. ఈ నెల 11న ఆర్‌టిజిఎస్, వినతుల పరిష్కారం, గ్రామ, వార్డు సచివాలయాలు, వాట్సాప్ గవర్నెన్స్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై చర్చిస్తారు. మధ్యాహ్నం నుంచి వ్యవసాయం, పశుసంవర్ధక, హార్టికల్చర్, పౌర సరఫరాలు, అడవులు, జలవనరులు, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, రూరల్ వాటర్ సప్లై, సెర్ప్, పట్టణాభివృద్ధి, సిఆర్‌డిఎ, శాంతి భద్రతలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ నెల 12న పరిశ్రమలు, ఐటి, ఇండస్ట్రీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, విద్యుత్తు, మానవ వనరులు, ట్రాన్స్‌పోర్టు, రోడ్లు, భవనాలు, హౌసింగ్, హెల్త్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళా సంక్షేమం, రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ వంటి వివిధ అంశాలపై అధికారులతో సిఎం చర్చిస్తారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు, ఐపిఎస్ అధికారులు పాల్గొననున్నారు.

## ల్యాండ్‌మైన్ పేలి జవాన్ మృతి

- జమ్ముకాశ్మీర్‌లో ఘటన
- మృతుని స్వస్థలం మార్కాపురం - నార్పలలో నివాసం

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)


సుబ్బయ్య (ఫైల్)

జమ్ముకాశ్మీర్‌లో పేలిన ల్యాండ్‌మైన్‌లో అనంతపురం జిల్లా నార్పలలో నివాసం ఉంటున్న సుబ్బయ్య (32) మరణించారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని రాయిపాడు గ్రామానికి చెందిన సుబ్బయ్య ఆర్మీలో జవాన్‌గా పని చేస్తున్నారు. ఈయన అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రం గవ్వల వీధికి చెందిన గవ్వల రామకృష్ణ కూతురు లీలావతిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వివాహ అనంతరం భార్యాపిల్లలను నార్పలలోనే ఉంచారు. సోమవారం మధ్యాహ్నం జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో అక్కడ ల్యాండ్ మైన్ పేలింది. ఈ ఘటనలో సుబ్బయ్య తీవ్రంగా గాయపడి వీరమరణం పొందారు. ఆయనకు భార్య లీలావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం నార్పలలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## 13న 'అన్నదాతకు అండగా వైసిపి'

- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు అండగా నిలిచేందుకు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా 'అన్నదాతకు అండగా వైసిపి' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పలువురు నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరి పంట వేసిన రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అకాల వర్షాలు, వాయుగుండాల వల్ల ఒకవైపు పంట దిగుబడులు తగ్గగా, మరోవైపు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పిన వాట్సాప్ నెంబరుకు మెసేజ్ చేసినా పట్టించుకునేవారే లేరని చెప్పారు. ఇప్పటి వరకూ 10 శాతం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదన్నారు. దీనికి నిరసనగా అన్ని జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు రైతు వ్యతిరేకి అని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చారని, ఆ హామీ అసలు నెరవేరుస్తారో లేదో తెలియడం లేదని అన్నారు. పోస్టర్‌ను ఆవిష్కరించిన వారిలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నారాయణమూర్తి, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు ఉన్నారు.

## బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -కార్వేటి నగరం (చిత్తూరు జిల్లా)

బాలికపై అత్యాచారం కేసులో నిందితున్ని అరెస్ట్ చేశామని కార్వేటినగరం సిఐ హనుమంతప్ప తెలిపారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం పోలీస్‌స్టేషన్లో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వేటి నగర మండలం గోపిశెట్టిపల్లికి చెందిన దినేష్ ప్రేమ పేరుతో బాలికను వంచించాడని, సినిమాకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- జనాభా ప్రాతిపదికన గిరిజన ప్రాంతానికి నిధులు కేటాయించాలి
- ప్రభుత్వ విధానాలతో జిసిసి నిర్వీర్యం : ఎస్.పుణ్యవతి
- సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా మహాసభ ప్రారంభం, బహిరంగ సభ



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అన్నారు. ఇందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరగనున్న సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభ కురుపాంలో మంగళవారం ఉత్సాహపూరితంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రావాడ జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను పూర్తిగా విస్మరించారన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, ప్రజలపై భారాలు మోపుతున్నారని వివరించారు. గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులోనూ, ఖర్చులోనూ కేంద్రం వివక్ష చూపుతోందని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. నాడు గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్, గిట్టుబాటు ధర కల్పించేందుకు జిసిసిని ఏర్పాటు చేయగా, బిజెపి అధికారంలోకి వచ్చాక ఆ సంస్థను నిర్వీర్యం చేసిందని తెలిపారు. గిరిజన ఆవాసాలను పక్కనపెట్టి, కార్పొరేట్ శక్తులు ఖనిజ సంపదను దోచుకునేందుకు వీలుగా అటవీ ప్రాంతంలో సైతం అధిక నిధులతో భారీ రోడ్లు వేస్తున్నారన్నారు. జీడి, పామాయిల్ ధరలు అంతర్జాతీయంగా పెరుగుతున్నా మనదేశంలోని రైతులకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**అభివృద్ధి ముసుగులో మతోన్మాదం : బి.తులసీదాస్**

అభివృద్ధి ముసుగులో బిజెపి, సంఘపరివార్ శక్తులు మతోన్మాదాన్ని నింపుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. మతం పేరిట ప్రజలను విభజించే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కుట్రలను గుర్తెరిగి మత విద్వేషాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం వచ్చే నెల ఐదున విజయవాడలో పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మతం ప్రాతిపదికన సభలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజల అభీష్టం మేరకు వారి మత సంప్రదాయాలు ఆచరించుకునేందుకు పాలకులు స్వేచ్ఛ ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మాన్ని తన భుజాన వేసుకున్నారన్నారు. భర్త చనిపోతే భార్యని సతీసహగమనం పేరిట చంపేయాలని సనాతన ధర్మం సూచిస్తోందన్నారు. ఇలాంటి ధర్మాన్ని ప్రభుత్వంలో ఉన్న వ్యక్తి ప్రచారం చేయడం తగదన్నారు.

**ప్రజల పేరిట అప్పులు చేసి కార్పొరేట్లకు ధారాదత్తం : కె.సుబ్బరావమ్మ**

ప్రజల పేరిట రూ.వేల కోట్లు అప్పులు చేసి అదాని తదితర కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ విమర్శించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 65 ఏళ్ల పాలనలో రూ.55 వేల కోట్లు అప్పు చేస్తే, బిజెపి పదేళ్ల పాలనలో రూ.110 వేల కోట్ల అప్పులు చేసిందని వివరించారు. అప్పుగా తీసుకొచ్చిన మొత్తాన్ని ఏయే ప్రాంతాల్లో ఏయే వర్గాలకు ఎంతెంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి రాగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం ఆచరణలో ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేస్తూ నిరుద్యోగాన్ని సృష్టిస్తోందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షత వహించారు. బహిరంగ సభకు ముందు కురుపాం పాత బస్టాండ్ నుంచి రావాడ జంక్షన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు ముందు భాగంలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు కమ్యూనిస్టుల క్రమశిక్షణకు అద్దం పట్టింది. కొందరు గిరిజన యువకులు విల్లంబులు చేతబూని గిరిజన సంప్రదాయ వేటను, అడవితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం సీతారాం ఏచూరి నగర్‌లోని బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో రుద్రరాజు సత్యనారాయణరాజు వేదికపై (సాయినందకి కల్యాణ మండపంలో) మహాసభ ప్రారంభమైంది.

## కడప స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రమే నిర్మించాలి

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టం ప్రకారం కడప స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం నిర్మించి ఇచ్చేలా ప్రకటన చేయించాలని సిఎం చంద్రబాబును ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పి బిజెపికి ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అవమానించినట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ప్లాంట్ ప్రతిపాదనే తమ వద్ద లేదంటూ అపహాస్యం చేసేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇంత జరుగుతున్నా.. రాష్ట్ర ఎంపిలు మౌనం వహించడం వారి చేతకాని తనానికి అద్దం పడుతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం విభజన చట్టాన్ని కాలరాసిందని, సీమ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని చెప్పారు. ఈ విషయంలో తమ వైఖరి ఏంటనేది సిఎం చంద్రబాబు వెల్లడించాలన్నారు. కేంద్రం పరిశీలనలో లేదనడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థి స్తుందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వమే ప్లాంట్ నిర్మి స్తుందని చంద్రబాబు గతంలో శంకుస్థాపన చేస్తే, ప్రైవేటు భాగస్వామ్యం కూడా ఉండాలని జగన్ రెండు సార్లు కొబ్బరికాయ కొట్టారని పేర్కొన్నారు.

## అప్పులతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-యల్లనూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా యల్లనూరు మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల మేరకు... గొడ్డుమర్రి గ్రామానికి చెందిన రైతు నాగప్ప (57)కు మూడెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇందులో వర్షాధార పంటలుగా వేరుశనగ సాగు చేసేవారు. ఇందు కోసం దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. గత నాలుగేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికందలేదు. అప్పులు తీర్చడం కష్టమై తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగారు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో రైతు మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ద్రవ్యోల్బణం, వృద్ధి సమతుల్యత పెద్ద సవాల్

- సైబర్ మోసాల కట్టడిపై దృష్టి పెట్టాలి
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్
- ఆరేళ్ల తర్వాత పదవీ విరమణ



**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్‌గా ఆరేళ్లు పూర్తి చేసిన శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేశారు. చివరి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం, వృద్ధి, సైబర్ మోసాలు ఆర్‌బిఐ ముందున్న ప్రధాన సవాళ్లని అన్నారు. సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కోవడానికి కొత్త సాంకేతికతలను ఉపయోగించడంపై దృష్టి సారించాలని సూచించారు. ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యతను పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. నాలుగేళ్లలో అత్యంత వేగంగా కూరగాయల ధరలు పెరగడంతో అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 6.21 శాతానికి చేరి 14నెలల గరిష్ఠ స్థాయి వద్ద నమోదయ్యిందని గుర్తు చేశారు.

పదవీ విరమణ సందర్భంగా ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎక్స్‌లో శక్తికాంత ధన్యవాదాలు తెలిపారు. ఇంతకాలం తనకు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. తనకు అవకాశం కల్పించిన ప్రధానీ మోడీ మార్గదర్శకం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్‌బిఐల మధ్య సమన్వయం అత్యుత్తమంగా ఉందన్నారు. అసాధారణమైన పరిస్థితులను ఎంతో విజయవంతంగా ఎదుర్కొన్నామన్నారు. విశ్వాసం, విశ్వసనీయత సంస్థగా ఆర్‌బిఐ ఎదగాలని ఆకాంక్షించారు. నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్ మల్హోత్రా అపారమైన అనుభవం కలిగి ఉన్నారన్నారు. ఆర్‌బిఐ కార్యకలాపాలను సమర్థవంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అసాధారణ వేగంతో విస్తరిస్తున్న విశ్వం

**న్యూయార్క్ :** విశ్వం ఊహించిన దానికన్నా అసాధారణ వేగంతో విస్తరిస్తోందని వెబ్ టెలిస్కోప్ డేటా ధ్రువీకరించింది. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ రెండేళ్ళపాటు ఇచ్చిన డేటా గతంలో హబుల్ రోదసీ టెలిస్కోప్ ఇచ్చిన డేటాతో సరిపోలుతోంది. విశ్వం విస్తరించే రేటు దాదాపు 8శాతం వేగంగా వుందని గతంలో హబుల్ పేర్కొంది. వందల కోట్ల సంవత్సరాల కాలంలో కాస్మోస్ కాంతి కిరణాల్లో తొలినాటి పరిస్థితులు, తదనంతర కాలంలో పరిణామ క్రమం గురించి ఖగోళ భౌతిక శాస్త్రవేత్తలు తెలుసుకున్న సమాచారం ప్రాతిపదికగా కన్నా చాలా వేగంగా విశ్వం విస్తరిస్తోందని భావించారు. అందుకే ఈ తేడాను హబుల్ టెన్షన్‌గా పిలుస్తారు. మన దగ్గర గల అత్యుత్తమ సిద్ధాంతాలు పేర్కొన్నదాని కన్నా చాలా వేగంగా విశ్వం విస్తరిస్తోందని మేరీల్యాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఆడమ్ రీస్ పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలోని బృందం చేసిన అధ్యయన నివేదికను అస్ట్రో ఫిజికల్ జర్నల్‌లో సోమవారం ప్రచురించారు. ఇప్పటివరకు విశ్వం గురించి మన అవగాహనలో కొంత భాగం కోల్పోయినట్లు కనిపిస్తోందని రీస్ పేర్కొన్నారు. ప్రధానంగా రెండు అంశాలు - కృష్ణ బిలం, కృష్ణ శక్తి (డార్క్ మేటర్, డార్క్ ఎనర్జీ) గురించి మనం విస్మరించామని, కానీ అవే ఈ విశ్వంలో 96శాతం వున్నాయని అన్నారు. అందువల్ల ఇదేమీ చిన్న విషయం కాదన్నారు. 13-14 వందల కోట్ల సంవత్సరాల క్రితం సంభవించిన బిగ్ బ్యాంగ్‌తో ఈ విశ్వం ఆవిర్భవించింది, అప్పటి నుండి క్రమంగా విస్తరిస్తూనే వస్తోంది.

## ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం

- రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. టిడిపి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ స్వామినాయుడుతో కలిసి టిడిపి కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. గత ఆరు నెలల కాలంలో వచ్చిన 67 వేల రెవెన్యూ ఫిర్యాదులు, రీసర్వేపై వచ్చిన 2.67 లక్షల ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరిస్తున్నామని చెప్పారు. పరిష్కరించలేని వాటిని ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో కూడా ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు.

**భూ బకాసురులు.. వైసిపి నేతలు : పంచుమర్తి అనురాధ**

రాష్ట్రంలో వైసిపి నేతలు భూ బకాసురులుగా మారారని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. అసైన్డ్, ఇనాం, ఫ్రీ హోల్డ్, దేవాదాయ, అటవీశాఖకు సంబంధించిన భూములను దేనినీ విడిచిపెట్టలేదన్నారు. టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

## ప్రచార ఆర్భాటమే!

**రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం తక్కువే**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు రోజులుగా గ్రామాల వారీ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. రెవెన్యూ సదస్సుల గురించి ప్రచారం ఎక్కువగా జరగ్గా, సమస్యల పరిష్కారమేమో అదే స్థాయిలో జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 1,012 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, నేటి వరకు సదస్సులకు 62,868 మంది హాజరైనట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 19,403 అర్జీలను ప్రభుత్వం స్వీకరించగా, అందులో కేవలం 170 సమస్యలకు తక్షణ పరిష్కారం లభించింది. దీంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమౌతోంది.

ఆర్ఒఆర్ కోసం 7,207, అసైన్‌మెంట్ హౌస్ సైట్స్ కోసం 1,116, ఏజెన్సీ ల్యాండ్ ప్రాబ్లమ్స్ కోసం 872, అసైన్‌మెంట్ ప్రభుత్వ భూమి కోసం 751 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. భూముల రీసర్వే గ్రీవెన్స్ కోసం 710, బౌండరీ డెమోక్రేషన్ కోసం 658, రీ సర్వే-ఎస్ఎస్ఎల్ఆర్ కోసం 416, ఎఫ్ లైన్ పిటిషన్స్ 319, 22(ఎ) భూములను అందులో నుంచి మినహాయించాలని కోరుతూ 280, రెవెన్యూ గ్రీవెన్స్ కోసం 234 దరఖాస్తులు అందాయి. ఇవికాక ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలంటూ 6,849 వినతులు అందాయి.

## త్వరలో క్రిస్మస్ కానుక

- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

త్వరలో క్రైస్తవులందరికీ క్రిస్మస్ కానుక అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విజయవాడ నాలుగో డివిజన్ వరలక్ష్మి నగర్‌లో రూ.80 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని పునరుద్ధరిస్తామని, రాష్ట్రంలో రూ.340 కోట్లతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిర్మిస్తామని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా డిసెంబర్, జనవరి నెలల్లోని రుణాలు అందిస్తామన్నారు. ఎస్‌సి సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులతో ప్రారంభించిన కమ్యూనిటీ హాళ్లను సాధారణ నిధులతో పూర్తి చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్లను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. లిడ్‌కాప్‌కు నిధులు, రుణాలు అందిస్తామని, విజయవాడ ఆటోనగర్‌లో విలువైన భూములను అన్యాక్రాంతం చేశారని, వాటిని స్వాధీనం చేసుకుని పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల మరమ్మతులకు రూ.140 కోట్లు కేటాయించామని తెలిపారు. వసతి గృహాల విద్యార్థులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి స్థలం కేటాయిస్తే గత ప్రభుత్వం స్థలాన్ని మార్పు చేసి విజయవాడ స్వరాజ్య మైదానంలో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని విమర్శించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాజెక్టుకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న హాళ్లు, తదితర పనులను పూర్తి చేస్తామన్నారు. విజయవాడలో వసతి గృహాల మరమ్మతులకు రూ.42 లక్షలు కేటాయించామని, విద్యార్థుల హాస్టల్ బకాయిలను డిసెంబర్‌లోనే చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ పాల్గొన్నారు.

## పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కూటమి ఎంపిల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని టిడిపి కూటమి ఎంపిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను టిడిపి, జనసేన, బిజెపి ఎంపిలు కలిశారు. అమరావతితోపాటు వారివారి నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన వినతులను పరిశీలిస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

సంపాదకీయం

# అసద్ పతనం వెనుక..!

**ప**శ్చిమాసియాలో అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పై జిహాదిస్టులు తిరుగుబాటు చేసి పదవీచ్యుతుణ్ణి గావించడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. చమురు సంపన్నమైన ఈ ప్రాంతంలో రష్యా, ఇరాన్ పలుకుబడిని దెబ్బతీసి, తన ఆధిపత్యానికి ఎదురు లేకుండా చూసుకోవాలన్న అమెరికా దుష్ట పన్నాగంలో భాగమే సిరియాలో అసద్‌పై తిరుగుబాటు. ఇంతకుముందు అరబ్ ప్రపంచంలో రంగు విప్లవాలను అమెరికా ఎలా ప్రోత్సహించినదీ చూశాం. సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు గత దశాబ్దన్నర కాలంగా అమెరికా కుట్రలు పన్నుతూనే ఉంది. ఉగ్రవాదంపై పోరాడుతున్నట్లు బయటకు పోజు పెట్టే అమెరికా, ఇతర పశ్చిమ దేశాల కపట వైఖరి సిరియాలో మరోసారి బట్టబయలైంది. అసద్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు అల్‌ఖైదా మూలాలున్న జిహాదిస్టు గ్రూపులకు సామ్రాజ్యవాద దేశాలు అధునాతన ఆయుధాలు, డబ్బు ఇచ్చి ఎలా ఎగదోసిందీ అందరికీ ఎరుకే. సిరియాలో అసద్ నిష్క్రమణ వెనుక ప్రాంతీయ, అంతర్జాతీయ శక్తుల పాత్ర తక్కువేమీ లేదు. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన హయత్ తెహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) అధినేత అబూ అహ్మద్ అల్ జొలాని అమెరికా కస్టడీలో అయిదేళ్లు ఉండి 2011లో సిరియాలో తలెత్తిన తిరుగుబాటుకు ముందు విడుదలయ్యాడు. ఆ తిరుగుబాటును లేవనెత్తడంలో జొలానీ పాత్ర ఉంది. హెచ్‌టిఎస్, ఫ్రీ సిరియన్ ఆర్మీ, స్థానిక తీవ్రవాద గ్రూపులను అన్నిటినీ కలుపుకుని సిరియన్ నేషనల్ అలయెన్స్ పేరుతో కూటమి ఏర్పాటు చేసి అసద్ ప్రభుత్వాన్ని కూల్చడమే ఏకైక ఎజెండాగా సిరియాలో అలజడి సృష్టించాడు. పదకొండు రోజుల క్రితం ఇడ్లిబ్‌లో మొదలైన తిరుగుబాటు అలెప్పో, హామ్ పట్టణాలను ఒక్కొక్కదానిని వశపరచుకుంటూ రాజధాని డమాస్కస్‌ను శనివారం రాత్రి ముట్టడించడంతో పారాకాష్టకు చేరింది. పరిస్థితి తీవ్రతను గమనించిన అధ్యక్షుడు అసద్ హింసను నివారించేందుకు శాంతియుతంగా అధికార బదలాయింపునకు వీలుగా దేశం వీడి కుటుంబంతో సహా రష్యాకు వెళ్లిపోయారు. సిరియా ప్రధాని జలీల్ అధికార మార్పిడిలో తిరుగుబాటు దారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించడంతో రాజ్యాధికారం ఇప్పుడు జిహాదిస్టుల చేతుల్లోకి వచ్చింది. సిరియాపై ఆధిపత్యం కోసం విభిన్న గ్రూపుల మధ్య విభేదాలు ఎటువంటి మలుపు తీసుకుంటాయో చెప్పలేం. ఇంతలోనే సిరియాకు చెందిన గొలాన్ హైట్స్ భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి ఇజ్రాయిల్ భీకర దాడులు ప్రారంభించింది. 1967లో యుద్ధం తరువాత కుదిరిన ఒప్పందం ప్రకారం ఏర్పాటైన గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌లోకి ఇజ్రాయిల్ చొరబడడంపై అరబ్ లీగ్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇజ్రాయిల్ దురాక్రమణను ఆపాలని ముక్త కంఠంతో అవి డిమాండ్ చేస్తున్నా అమెరికా, వాటి మిత్ర పక్షాలు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. అసద్ పతనం తరువాత అమెరికా తదుపరి లక్ష్యం ఇరానేనని వార్తలొస్తున్నాయి. సిరియా పరిణామం తరువాత ఈ ప్రాంత రాజకీయ భౌగోళిక స్వరూపంలో పెను మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. తిరోగామి శక్తుల చేతుల్లో సిరియా భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు సర్వత్రా నెలకొన్నాయి. 1970లో అధికారంలోకి వచ్చిన హఫీజ్ అల్ అసద్‌ను ఆధునిక సిరియా నిర్మాతగా పేర్కొంటారు. ఆయన వారసుడిగా 2000లో పగ్గాలు చేపట్టిన తనయుడు బషర్ అల్ అసద్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేశారు. అయితే, పశ్చిమ దేశాల ఆంక్షలు, అంతర్యుద్ధం వల్ల ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. సుమారు కోటీ 20 లక్షల మంది వలసపోయారు. ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోనే సుమారు 20 లక్షల మంది శరణార్థులుగా రోజులు నెట్టుకొస్తున్నారు. తీవ్రవాద సంస్థ అల్‌ఖైదాకు ఒకనాటి శాఖ అయిన హెచ్‌టిఎస్ లక్ష్యం సిరియాను ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే. సున్నీలు, షియాలు, క్రైస్తవులు, అలవిలు, డ్రూజ్‌లు తదితర మతాల ప్రజలు సహజీవనం చేసే ప్రాంతాన్ని లౌకిక రాజ్యంగా తీర్చిదిద్దడంలో అసద్ నేతృత్వంలోని బాత్ పార్టీ విశేషమైన కృషి చేసింది. శాంతి, సౌభాగ్యం, ప్రజాస్వామ్యం, విభిన్న సంస్కృతులు, జాతులు, మతాలతో కూడిన వైవిధ్యాన్ని కాపాడుకుంటూ ఐక్యంగా ముందుకు సాగడం నేడు సిరియా ముందున్న అతి పెద్ద కర్తవ్యం. ఇందుకోసం సిరియాలోని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు సాగించే పోరాటానికి అంతర్జాతీయ కార్మిక వర్గం బాసటగా నిలవాలి. ఈ పోరాటంలో అమెరికా ఒత్తిళ్లకు లొంగకుండా భారత్ సిరియా ప్రజల పక్షాన గట్టిగా నిలబడాలి.

మంచిమాట



**ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు.
జీవితంలోని కష్టాలను తీర్చలేనిది ఆవిష్కరణా కాదు.
జీవితంలోని ప్రతి కోణాన్నీ చూపించలేనిది సాహిత్యమే కాదు.**

**- కొడవటిగంటి కుటుంబరావు,**
**ప్రముఖ రచయిత.**

విశ్లేషణ

# పోర్టుల కబ్జా - పాలక పార్టీల పాపాలు




**డా॥ బి. గంగారావు**

**కా**కినాడ సీ పోర్టు, కాకినాడ సెజ్ లోని వాటాలను వైసిపి ప్రభుత్వ హయాంలో బలవంతంగా లాక్కోవటం, రేషన్ బియ్యం అక్రమ రవాణా, అదానీ సోలార్ విద్యుత్ ముడుపుల వ్యవహారం గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. పాలక పార్టీలు వివిధ పేర్లు, ఒప్పందాలు, బదిలీలు, సంక్షేమం పేర సంపదను, ప్రజల ఆస్తులను ఎలా కొల్లగొడుతున్నాయో, అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ బినామీలకు, ఆప్తులకు, క్రోనీలకు ఆస్తులను ఎలా కట్టబెడుతున్నాయో, పేదల రేషన్ బియ్యాన్ని సైతం ఎలా బొక్కేస్తున్నాయో ప్రజలకు తేటతెల్లం చేస్తున్నాయి. కాకినాడ సీ పోర్టు, కాకినాడ సెజ్ మాదిరిగానే రాష్ట్రంలోని గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానీ దౌర్జన్యంగా తన వశం చేసుకున్నారు. అదానీ భారీ అక్రమాలపై విచారణ జరుపుతామని రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం మాట వరుసకు కూడా అనడం లేదు. అదానీ సోలార్ విద్యుత్ ముడుపులపై కూడా నోరు విప్పటం లేదు. ఎందుకని? రాష్ట్రంలో ఏలినవారు, ఏలుతున్న వారు పార్టీలుగా వేరైనా ప్రజల ఆస్తులను లూటీ చేయడంలోనూ, కార్పొరేషన్లకు, క్రోనీలకు కట్టబెట్టటంలో వీరి మధ్య ఎలాంటి తేడా లేదు. కాకినాడ సీ పోర్టు, కాకినాడ సెజ్ ఘటనలతో పాటు గంగవరం, కృష్ణపట్నం పోర్టుల బదలాయింపు పర్వంలో పాలక పార్టీల బండారాన్ని పరిశీలిద్దాం.

కాకినాడ సీ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ (కె.ఎస్.పి.ఎల్)ను, కాకినాడ సెజ్‌లో ఉన్న వాటాలను వైసిపి ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి అండతో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో సంస్థ యజమాని శరత్ చంద్రారెడ్డి భయపెట్టి బలవంతంగా బదలాయింపు చేసుకున్నారని వాటి యజమాని కర్నాటి వెంకటేశ్వర రావు సిబిఐకి ఫిర్యాదు చేశారు. కాకినాడ సీ పోర్టు లోని రూ.2500 కోట్ల విలువగల వాటాలకు రూ.494 కోట్లు, కాకినాడ సెజ్‌లో వున్న రూ.1109 కోట్లు విలువ చేసే వాటాలకు కేవలం రూ.12 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. భయపెట్టి సంతకాలు చేయించుకొని ఆస్తులను బదలాయించుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఈ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి విచారణ చేపట్టింది.

అయితే ఇక్కడ కొన్ని విషయాలను మనం పరిశీలిస్తేనే ఈ అడ్డగోలు దోపిడీకి మూలం, బలవంతపు బదలాయింపులు, ఏ పార్టీ ఏమేం చేసింది, ప్రజల సంపదను యథేచ్ఛగా అభివృద్ధి పేర ఎలా కొల్లగొడుతున్నారో అర్థమౌతుంది. కాకినాడ సీ పోర్టును 1997లో రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లతో తన సొంత నిధులతో నిర్మించింది. ఆ తరువాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగానే కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి 22 శాతం స్థూల రాబడిలో వాటాకి పరిమితమై ఒప్పందం చేసుకొని కారుచౌకగా 1999లో ఈ పోర్టును కార్నాటి వెంకటేశ్వరరావుకి ధారాదత్తం చేశారు. అప్పుడు ఆయన టిడిపికి చెందిన వ్యక్తిగా ప్రచారం జరిగింది. వాస్తవంగా అవినీతికి, ప్రజల ఆస్తుల లూటీకి ఇక్కడే బీజం పడింది. ఈ పోర్టును ప్రైవేటీకరించటాన్ని నాటి యాంకరేజ్ పోర్టు కార్మికులు తీవ్ర ఉద్యమం చేపట్టారు. ప్రైవేటీకరణ చర్యల వల్ల ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో యాంకరేజ్ పోర్టు నిర్వహిస్తున్న కార్గో హ్యాండ్లింగ్ సరుకులను ప్రైవేట్‌పరం చేసిన కాకినాడ సీ పోర్టులో ఎగుమతి చేయరని ఒప్పందం చేశారు. ఆ సరుకులు మినహా కొత్త కార్గోకి మాత్రమే పరిమితం అవుతుందని హామీ ఇచ్చారు. ఆ తరువాత ఈ హామీని అధికారంలో ఉన్న పార్టీల అండతో ఉల్లంఘించి చివరికి కేవలం బియ్యం ఎగుమతికే యాంకరేజ్ పోర్టును పరిమితం చేసి వేలాది మంది ఉపాధిని దెబ్బతీశారు.

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కాకినాడ సీ పోర్టును కర్నాటి వెంకటేశ్వరావు నుండి బలవంతంగా వైసిపి రాజకీయ, పెట్టుబడిదారీ ముఠా గుంజుకుంది. ఇక్కడ మరో విషయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. అభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి పేర కాకినాడ సెజ్‌ను, దీనికి అనుబంధంగా మరో ఎస్‌ఇజెడ్ పోర్టు నిర్మాణాన్ని తెర మీదకు తీసుకొచ్చారు. ఇందుకు 10,500 ఎకరాల భూములను రైతుల నుండి బలవంతపు సేకరణకు తెరలేపారు. ప్రజలు ఈ భూ దోపిడిని తీవ్రంగా ప్రతిఘటించారు. 2014 ఎన్నికల్లో సెజ్‌కి భూములు తీసుకోబోమని చంద్రబాబు నాయుడు ప్రజలకు వాగ్దానం చేసినా...తీరా గెలిచాక వారి ప్రభుత్వం బలవంతపు భూసేకరణను పాల్పడింది. 2019 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో జగన్ మోహన్ రెడ్డి కూడా చంద్రబాబు వలె మాట ఇచ్చి రైతులను మోసం చేశారు. చివరకు జరిగిందేమిటి? కాకినాడ సెజ్ భూమి మొత్తం 10,500 ఎకరాలు కర్నాటి వెంకటేశ్వరావు, జిఎంఆర్‌కి కట్టబెట్టారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు రైతుల భూములను అప్పనంగా పంచేసుకున్నారు. ఆ తరువాత వైసిపి అధికారంలోకి వచ్చాక జిఎంఆర్ 51.26 శాతం వాటాను అరబిందో యాజమాన్యం కొనుగోలు చేసింది. దీంతో కాకినాడ ఎస్‌ఇజెడ్ పోర్టు కూడా అరబిందో పరమైంది. దీని వెనుక గూడా పెద్ద అవినీతి కథ నడిచినట్లు తెలుస్తున్నది.



> కాకినాడ సీ పోర్టు, కాకినాడ సెజ్ మాదిరిగానే రాష్ట్రంలోని గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానీ దౌర్జన్యంగా తన వశం చేసుకున్నారు. అదానీ భారీ అక్రమాలపై విచారణ జరుపుతామని రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం మాట వరుసకు కూడా అనడం లేదు. అదానీ సోలార్ విద్యుత్ ముడుపులపై కూడా నోరు విప్పటం లేదు. ఎందుకని? రాష్ట్రంలో ఏలినవారు, ఏలుతున్న వారు పార్టీలుగా వేరైనా ప్రజల ఆస్తులను లూటీ చేయడంలోనూ, కార్పొరేషన్లకు, క్రోనీలకు కట్టబెట్టటంలో వీరి మధ్య ఎలాంటి తేడా లేదు.

విశాఖ ఎయిర్ పోర్టును మూసేసి భోగాపురంలో కొత్తగా అంతర్జాతీయ ఎయిర్ పోర్టును పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మించాలని చంద్రబాబు నాయుడు 2014లో ముందుకు తీసుకొచ్చారు. 5040 ఎకరాల భూసేకరణకు పాల్పడ్డారు. ఆ తరువాత 2700 ఎకరాలకు పరిమితం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ పోర్టు నిర్మాణం అప్పగిస్తే అత్యధిక ఆదాయ షేర్ ఇచ్చేలా ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) ముందుకొచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. 2017లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోర్టు టెండర్లలో మొదటి స్థానంలో నిలిచింది. కానీ చంద్రబాబు ఎఎఐ టెండర్‌ను తిరస్కరించడమేగాక రద్దు చేసి ఆ తరువాత 2019లో జి.ఎం.ఆర్ కి కట్టబెట్టారు. దీనిని ఆనాడు వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకించి రద్దు చేస్తామని 2019 ఎన్నికల్లో వాగ్దానం చేశారు. గెలిచిన తరువాత చేసిందేంటి?

జి.ఎం.ఆర్ సంస్థకు భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను కట్టబెడుతూ 2020 జూన్‌లో ఒప్పందం చేశారు. ఆ తరువాత జిఎంఆర్ సంస్థ కాకినాడ సెజ్‌లో ఉన్న 51 శాతం వాటాను రూ.2610 కోట్లకు అరబిందో సంస్థకు అమ్మేసింది. ఈ సొమ్మును 2021లో రూ.1600 కోట్లు, ఆ తరువాత రెండు లేదా మూడేళ్లలో మిగిలిన సొమ్ము అరబిందో సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. ఇదంతా పెద్ద గూడు పుఠాణి. భోగాపురం ఎయిర్ పోర్ట్, కాకినాడ సెజ్ వాటా క్విడ్ ప్రో కో (నీకు అంత నాకు ఇంత)లా వుంది. ఈ వ్యవహారంపై చంద్రబాబు నాయుడు నోరు విప్పటంలేదు. ఎందుకంటే జి.ఎం.ఆర్ సంస్థ బిజెపి కి, టిడిపి కి అత్యంత సన్నిహితమైనది కాబట్టి. ఇక దేశంలోని ప్రైవేట్ పోర్టుల్లో అదానీ ముంద్రా పోర్టు తరువాత ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న అతి పెద్దవి గంగవరం, కృష్ణపట్నం పోర్టులు. ఈ రెండిటినీ కాకినాడ సీ పోర్టు కంటే దారుణంగా 2021లో కేంద్ర బిజెపి అండతో అదానీ దౌర్జన్యంగా కబ్జా చేశారు. ఈ అడ్డగోలు దోపిడీపై టిడిపి కూటమి ప్రభుత్వం నోరు మెదపటం లేదు. ఎందుకని? అదానీ నరేంద్ర మోడీ సన్నిహిత క్రోనీ. టిడిపి కి కూడా మంచి మిత్రుడు. అందుకే అదానీ సోలార్ విద్యుత్ ముడుపుల పైనా స్పందించడంలేదు.

గంగవరం పోర్టు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పిపిపి విధానంలో చంద్రబాబు ప్రభుత్వం 2003లో ముందుకు తీసుకొచ్చిన పోర్టు. వాస్తవంగా ఈ పోర్టును విశాఖ స్టీల్ ప్లాంట్‌కి అనుబంధంగా సమీకృత పోర్టుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణంలోనే ఒక భాగం. విశాఖ స్టీల్ ప్లాంట్ గంగవరం పోర్టు నిర్మాణానికి ముందుకొచ్చినా ఆనాడు చంద్రబాబు తిరస్కరించారు. విశాఖ పోర్టు ట్రస్ట్ కూడా గంగవరంలో శాటిలైట్ పోర్టును నిర్మిస్తానని ప్రతిపాదించినా అంగీకరించలేదు. చివరికి డివిఎస్ రాజుకి పిపిపి కింద 30 ఏళ్ల ప్రాతిపదికన గంగవరం పోర్టును అప్పగించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం 1000 ఎకరాల భూమి కేటాయించింది. ఆ తరువాత టిడిపి, బిజెపి ఏకమై స్టీల్‌ప్లాంట్‌పై ఒత్తిడి తెచ్చి మరో 2000 ఎకరాలు 2003లో డివిఎస్ రాజుకి కట్టబెట్టారు. ఆ సందర్భంగా కూడా గంగవరం పోర్టులో సొంత బెర్త్‌లను నిర్మించుకుంటామని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రతిపాదించినా చంద్రబాబు నాయుడు ససేమిరా అంగీకరించ లేదు. పోర్టుకి భూమి ఇచ్చినందుకు పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి 10.4 శాతం వాటాగా చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ తరువాత డివిఎస్ రాజు తన 89.6 శాతం వాటాలోని 31.5 శాతాన్ని అమెరికా వార్‌బర్గ్ పింకస్ అనే ఈక్విటీ ఫైనాన్స్ సంస్థకి అమ్మేశారు.


అదానీ సంస్థ మొదట 2021లో అమెరికా ఈక్విటీ సంస్థ వాటాను కొనేసింది. ఆ తరువాత అదానీ (కాకినాడ సీ పోర్ట్ యజమాని కర్నాటి వెంకటేశ్వరావును భయపెట్టినట్లే) కేంద్ర బిజెపి నాయకత్వాన్ని రంగంలోకి దింపి ఆగమేఘాల మీద డివిఎస్ రాజు వాటా 58.1 శాతాన్ని దౌర్జన్యంగా బదలాయింపు చేసుకున్నారు. 2015 నాటికే గంగవరం పోర్టు విలువ రూ.13 వేల కోట్లుగా లెక్కగట్టారు. కానీ 2021లో కేవలం షేర్ ధరను ఏక పక్షంగా రూ.120గా లెక్క గట్టి రూ.6200 కోట్లకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. ఆ సొమ్ము కూడా పూర్తిగా ఇవ్వకుండా అదానీ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో 4.8 కోట్ల షేర్లను (షేర్ ధర రూ.754 చొప్పున) అంటగట్టారు. ఆ తరువాత వైసిపి ని మచ్చిక చేసుకొని రాష్ట్ర ప్రభుత్వ 10.4 శాతం వాటాను ఎటువంటి బహిరంగ టెండర్లు లేకుండానే అక్రమ పద్ధతిలో రూ.645 కోట్లకు కొనుగోలు చేశారు. దీంతో మొత్తం గంగవరం పోర్టు అదానీ పరమైంది. ఈ దుర్మార్గపు ఆక్రమణపై ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ఏమాత్రం స్పందించటం లేదు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ వాటా అక్రమ బదలాయింపుపై విచారణ జరిపిస్తామని కూడా అనడంలేదు.

మరో పోర్టు కృష్ణపట్నం. ఈ పోర్టు కూడా 2003లో బిల్ట్-ఆపరేట్-షేర్-ట్రాన్స్‌ఫర్ (బిఓఎస్‌టి) ప్రాతిపదికన 30 ఏళ్ళపాటు నిర్వహించుకునేలా నవయుగ గ్రూప్ సంస్థకి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చింది. గంగవరం పోర్టు లాగే ఈ పోర్టును కూడా నరేంద్ర మోడీ అండతో 2020లో అదానీ సొంతం చేసుకున్నారు. మొదట 75 శాతం వాటాను రూ.13,000 కోట్లకు ఒప్పందం చేసుకొని ఆ తరువాత 13 శాతం తగ్గించి రూ.12,000 కోట్లకు పరిమితం చేశారు. 2021లో 'విశ్వ సముద్ర' పేర ఉన్న 25 శాతాన్ని కూడా రూ.2800 కోట్లు చెల్లించి కృష్ణపట్నం పోర్టును అదానీ పూర్తిగా తన వశం చేసుకున్నారు. ఇప్పుడు దేశంలో పోర్టుల ద్వారా జరిగే ఎగుమతులు, దిగుమతుల్లో 35 శాతానికి అదానీ ఎదిగాడు. ఈ దోపిడీ అంతా కేంద్ర బిజెపి అండతో విచ్చలవిడిగా అదానీ సాగిస్తున్నారనటంలో ఎలాంటి సందేహం లేదు.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

విమర్శ

# బౌన్సర్లకు నియమ నిబంధనలు అవసరం



**ఎస్. వినయ కుమార్**



**'పు**ష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ లోని సంధ్య థియేటర్‌లో ఒక మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యాడు. అట్లే విఐపిలు, సెలబ్రిటీలు విద్యా వ్యాపారులు సహా వ్యాపార దిగ్గజాలు తమ చుట్టూ ఎక్కువ సంఖ్యలో బౌన్సర్లను వెంట బెట్టుకొని బయల్దేరే సంప్రదాయం మొదలైంది. కొద్ది దశాబ్దాల క్రితం ఈ దుస్థితి లేదు. బహుశా 1976లో కావొచ్చు. నేను సైకిల్ మీద ఓల్డ్ ఎంఎల్‌ఏ క్వార్టర్సు ముందు నుండి బషీర్‌బాగ్ వైపు వెళ్తున్నాను. నా పక్క నుండి ఒక ఫియట్ కారు దూసుకెళ్లి అసెంబ్లీ స్పీకర్ వీరమాచినేని ఇంటి ముందు ఆగింది. అప్పట్లో ఆ రోడ్డు ఇప్పుడున్నంత విశాలంగా లేదు. అయినా రోడ్డు మీద కారు పార్క్ చేయడానికి ఇబ్బంది ఉండేది కాదు. ఎంఎల్‌ఏల క్వార్టర్లన్నీ కాంపౌండ్ లోపల ఉండేవి. స్పీకర్ ఇంటి గేటు ఒక్కటే రోడ్డు మీదికి ఉండేది. ఆగిన కార్లోంచి తెల్లటి పంచె, తెల్ల లాల్చీ ధరించిన ఒక వ్యక్తి దిగి విసా విసా నడుచుకుంటూ స్పీకర్ ఇంట్లోకి వెళ్లారు. ఆ వ్యక్తిని చూసి నేను సంతోషం పట్టలేక పోయాను. ఎందుకంటే ఆయన ఎవరో కాదు. ఆయన నా అభిమాన తెలుగు హీరో అక్కినేని నాగేశ్వరరావు. ఒక్కరే కారు నడుపుకొంటూ వచ్చారు.

ఆ తర్వాత మరోసారి ఆయన్ని అలాగే చూశాను. నేను పని చేస్తున్న ఆస్పత్రిలో సాయంకాలం ఏడు గంటల తర్వాత ఆ రోజు కలెక్షన్‌ను క్యాష్ బుక్‌తో సరిచూసుకొంటున్నాను. ఇంతలో కౌంటర్ డోర్ దగ్గర నుండి 'ఎక్స్‌క్యూజ్ మి. వేర్ ఈజ్ జి.ఎస్.రెడ్డి రూం?' అంటూ మృదువుగా ఒక కంఠం వినబడింది. తల తిప్పి చూస్తే నాలుగడుగుల దూరంలో ఒంటరిగా ఏఎన్నార్. సంభ్రమాశ్చర్యాలతో దిగ్గున లేచి నిలబడ్డాను. టేబుల్‌పై ఉన్న క్యాష్‌ను గబాగబా టేబుల్ డ్రా లోకి తోసి తాళం వేశాను. 'ఐ విల్ షో యు సర్...' అంటూ ఫస్ట్ ఫ్లోర్‌కు దారి తీశాను. నా వెనక ఏఎన్నార్. ఎదురుబడిన స్టాఫ్, పేషెంట్ల అంటెండర్లు గోడకు అతుక్కుపోయి మర్యాదగా దారి ఇచ్చారు. 'ఇదే రూం సర్...' అంటూ ఒక ఏసి రూంను చూపెట్టి నేను వచ్చేశాను. ఆ గదిలో ఏఎన్నార్ ఎంత సేపున్నారో ఎప్పుడు వెళ్లిపోయారో తెలియలేదు. ఎంత గప్ చుప్‌గా వచ్చారో అంతే గప్ చుప్‌గా వెళ్లిపోయి ఉంటారు.

జి.ఎస్.రెడ్డి చాలా కాలం పాటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన పెద్ద కాంట్రాక్టరని విన్నాను. అప్పటికి జి.కె రెడ్డి పేరు అంతగా తెలియదు. కనుక వారి బంధుత్వం గురించి తెలియదు. కాని 'ది హిందూ' పత్రిక కరెస్పాండెంట్ జి.కె. రెడ్డికి ఆయన బంధువని తెలుసు. ఒకసారి జి.కె.రెడ్డి కూడా జి.ఎస్.రెడ్డిని పరామర్శించడానికి వచ్చారు. ఏఎన్నార్ ను చూసి ఎంత సంతోషం కల్గిందో, జి.కె. రెడ్డిని చూసినా అంతే సంతోషం కల్గింది. ఆయన హిందూలో రాసిన వార్తలను చాలా కష్టపడి చదివేవాడిని, పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే వాడిని. ఎడమ చేతిలో సిగరెట్ డబ్బా, లైటర్ కుడి చేతిలో సిగరెట్‌తో కన్పించాడు. చెయిన్ స్మోకర్ గదా. అప్పట్లో పొగ తాగడం మీద ఇప్పటిలా ఆంక్షలు లేవు. వార్డుల్లో తప్ప ఆస్పత్రి కారిడార్లలో సీనియర్ డాక్టర్లు, రిచ్ అటెండెంట్లు కులాసాగా సిగరెట్లు తాగేవారు.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడు వనపర్తి సంస్థానం మాజీ రాజు జె.రామేశ్వరరావు కూడా డాక్టర్లను కలవడానికి తరచూ ఆస్పత్రికి ఒంటరిగానే వచ్చేవారు. క్యాష్ కౌంటర్‌కు వీపు పెట్టి డాక్టర్లతో వరండాలోనే కబుర్లు చెప్తుండేవారు. ఆయన చేతిలో ఖరీదైన సిగరెట్ డబ్బా, లైటర్, ఎప్పుడూ ఉండాల్సిందే. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ జయసింహ కూడా ఒంటరిగానే వచ్చేవాడు. చాలా మంది ప్రముఖులు తమ వెంట ఏ పటాలం లేకుండా ఒంటరిగానే తమ కార్లు తామే నడుపుకొంటూ వచ్చేవారు. బౌన్సర్లు, బాడీగార్డులు అంటూ ఎలాంటి హడావిడి ఉండేది కాదు. కేంద్రంలో మంత్రిగా ఉండిన కోట్ల విజయ భాస్కర రెడ్డి కూడా ఎలాంటి అలికిడి లేకుండా తనకు తెలిసిన ఓ పేషెంట్‌ను పరామర్శించి వెళ్లారు. ఈ విషయంలో మర్రి చెన్నారెడ్డి తీరు వేరు. యుపి కో, పంజాబ్ కో గవర్నర్‌గా ఉండగా ఆయన ఆస్పత్రికి వస్తున్నారని మఫ్టీ పోలీసులు వచ్చి కౌంటర్‌లో ఉన్న నాతో చెప్పారు. ఆయన్ని మర్యాదగా రిసీవ్ చేసుకోవడానికి పెద్దలెవరైనా గేట్ దగ్గర ఉండాలని దాని సారాంశం. మఫ్టీ పోలీసులు నాతో మాట్లాడుతుండగా అప్పటి నిజాం ఆర్థోపెడిక్ సూపరింటెండ్ డాక్టర్ ఎం.రంగారెడ్డి దూరం నుండి చూశారు. నా దగ్గరకొచ్చి 'ఏమిటంట?' అనడిగారు. నేను చెప్పాను. ఆయన మర్రి చెన్నారెడ్డికి ఎంబిబిఎస్ లో సహాధ్యాయుడో లేక సీనియరో తెలియదు గాని పొలిటీషియన్లను మనం పట్టించుకోనక్కర్లేదు. లైట్‌గా తీస్కో అన్నటు సైగ చేశారు. చెన్నారెడ్డి తన అనుచరుల పటాలంలో హడావిడిగా వచ్చారు, వెళ్లిపోయారు. ఒకసారి ఎన్‌టి రామారావు కూడా ఎవరినో పరామర్శించడానికి వచ్చారు. కౌంటర్లో ఉన్న నాకు ఆ విషయం ఎవరో చెవిన వేశారు. నేను కౌంటర్ లాక్ చేసి బయటికి వచ్చాను. ఆయన మెల్లిగా ర్యాంపు దిగుతూ వచ్చారు. ఆయన చుట్టు ఏవరూ లేరు. పదడుగుల దూరంలో ఒకతను అప్పుడప్పుడూ వెనక్కి చూస్తూ దిగుతున్నాడు బహుశా డ్రైవరేమో. టెర్లిన్ 'హాఫ్ షర్టు', టెరికాటన్ ప్యాంటులో సింపిల్‌గా ఉన్నారు. తనకు ఎదురుపడిన వారి ముఖాల్లోకి చిరునవ్వుతో చూస్తూ హుందాగా ర్యాంప్ దిగి వెళ్లిపోయారు. వంటి మీద నేటి హీరోల్లా రంగురంగుల పూలపూల దుస్తులేవు. అప్పటికే టెర్లిన్ బట్ట ఉత్పత్తి ఆగిపోయింది. బహుశా ఎప్పుడో కుట్టించింది వేసుకొని ఉంటారు.

నటీమణులూ అంతే. ఒక రోజు సాయంకాలం జయప్రదను వెంటబెట్టుకొని సుబ్బరామిరెడ్డి కౌంటర్ దగ్గరికి వచ్చి 'కంటి డాక్టర్ వచ్చారా? ఈమెను చూపించాలి' అనడిగారు. ఆయన వెనుక తెల్లగా మిలమిల మెరుస్తున్న ఒక మహిళ సాధారణ చీర, జాకెట్‌తో నిలబడి ఉంది. ఈమెను ఎక్కడో చాలా దగ్గరగా చూశాను కాని జ్ఞాపకం రావడం లేదే అని తికమక పడ్డాను. 'భూమి కోసం'లో చెల్లి చంద్రమ్మను చూశాను కాని వెంటనే గుర్తుకు రాలేదు. ఆమె బెరుకు చూపులు చూస్తున్నారు. ఒకసారి జయసుధ ఎవరినో పరామర్శించడానికి ఒక్కరే వచ్చారు. తనను చూసి దగ్గరికి వచ్చిన వారితో ఆస్పత్రి వరండాలో నిలబడి కులాసాగా మాట్లాడారు. అప్పటికే ఆమె చేసిన సినిమాలు బాగా నడిచి మహిళల్లో 'అభిమాన' నటి అయ్యారు. అయినా సింపుల్ చీరలో వచ్చారు. బౌన్సర్లు, బాడీగార్డులు లేరు. స్వాతికిరణం శతదినోత్సవానికి రాజ్ కపూర్ ముఖ్య అతిథి. కమల్ హాసన్, చిరంజీవి, జయప్రద వంటి తారాగణమంతా హాజరయ్యారు. ఫంక్షన్ దేవి థియేటర్‌లో జరిగింది. ఫంక్షన్ అయ్యాక రాజ్ కపూర్ నా ముందు నుండి మెట్లు దిగి వెళ్లిపోయారు. అంత పాపులర్ నటుడి చుట్టూ ఆ సినిమాకు సంబంధించిన ఇద్దరు ముగ్గురే ఉన్నారు. బౌన్సర్లు, బాడీగార్డులు లేరు. పెద్ద కమోషన్ లేదు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఒక అసిస్టెంట్ డైరెక్టర్ పెళ్లికి సూపర్‌స్టార్ కృష్ణ ఎలాంటి సెక్యూరిటీ లేకుండా వచ్చారు. సి.ఐ.టి.యు నాయకుడు వి.శ్రీహరి కుమార్తెతో అసిస్టెంట్ డైరెక్టర్‌కు జరిగిన దండల పెళ్లి అది.

హైదరాబాద్‌లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 1986లో జరిగింది. ఆ సందర్భంగా కొందరు పాపులర్ నటులను, దర్శకులను గమనించాను. ప్రజాశక్తి విలేకరిగా నేను ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌ను కవర్ చేశాను. ఫెస్టివల్ సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్సులు, బ్రీఫింగ్‌లు జూబ్లీహాల్ లోనూ, విధాన పరిషత్ భవనంలోను జరిగేవి. ఆ చిత్రోత్సవానికి రామకృష్ణ 70 ఎం.ఎం మెయిన్ థియేటర్ అయినా చాలా మంది నటులు, దర్శకులు, చిత్రోత్సవం అర్గనైజర్లు సినాప్సిస్‌లు కూడా అక్కడే ఇచ్చేవారు. జూబ్లీ హాల్‌కు వచ్చేవారు. అక్కడ దాదాపు ప్రతిరోజూ ఒకనాటి హిందీ హీరో అశోక్ కుమార్ కన్పించేవారు. ఆయనకు ఒక చేతిలో సిగరెట్ ప్యాకెట్ మరో చేతిలో స్టిక్ ఉండేది. వెంట ఎవరూ ఉండే వారు కాదు. పలుకరించిన వారితో సరదాగా మాట్లాడేవారు. ఒక్కడే బయటికి వచ్చి వాహనం ఎక్కి తన హోటల్‌కో, సినిమా థియేటర్‌కో వెళ్లేవారు. ఆ సమయంలో ఒకరోజు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఒంటరిగా మెట్లు దిగి వస్తున్న ప్రఖ్యాత దర్శకుడు హృషికేశ్ ముఖర్జీని చూశాను. వెనక ముందూ ఎవరూ లేరు. నేను చిరునవ్వుతోనే నమస్కారం పెట్టి ఆయన వెనకే మెట్లు దిగొచ్చారు. నా సహాయం ఏదైనా అవసరమౌతుందేమో అనుకొన్నాను. ఆయన రోడ్డు మీదికి వచ్చి ఆటో ఆపి అందులో ఎక్కి వెళ్లారు.

> ఏఎన్నార్ మరణించినప్పుడు చూసిన ఒక సంఘటన నాకు విస్మయం కల్గించింది. నివాళులు అర్పించడానికి ఒక హీరో దాదాపు 20 మంది బౌన్సర్లతో వచ్చాడు. బౌన్సర్లు జడ్ ప్లస్ కేటగిరి నాయకుడికి చేసేంత హడావిడి చేశారు. సినీ ప్రముఖులు మాత్రమే ఉండే చోటుకి అంత పెద్ద సంఖ్యంలో బౌన్సర్లను వేసుకొని ఎందుకొచ్చినట్లు? సంతాపం ప్రకటించే చోట ఇలా షో పుటప్ చేయడేమిటి! అన్పించింది. ఎంతమంది బౌన్సర్లను వెంటేసుకొని వస్తే అంత గొప్ప అనుకొంటున్నారేమో అన్పిస్తుంది. బౌన్సర్లు, చుట్టూ ఉన్న వారిని దుర్మార్గంగా నెట్టేయడం సాధారణమైంది. 'పుష్ప 2' సినిమా ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్లో జరిగిందదే.

కాగా ఏఎన్నార్ మరణించినప్పుడు చూసిన ఒక సంఘటన నాకు విస్మయం కల్గించింది. నివాళులు అర్పించడానికి ఒక హీరో దాదాపు 20 మంది బౌన్సర్లతో వచ్చాడు. బౌన్సర్లు జడ్ ప్లస్ కేటగిరి నాయకుడికి చేసేంత హడావిడి చేశారు. ఆ హీరో ఒక నిమిషం కూడా అక్కడ ఉండకుండా యంత్రంలా పుష్పగుచ్ఛం ఉంచి యంత్రంలా వెంటనే వెనుదిరిగి వెళ్లిపోయారు. సినీ ప్రముఖులు మాత్రమే ఉండే చోటుకి అంత పెద్ద సంఖ్యంలో బౌన్సర్లను వేసుకొని ఎందుకొచ్చినట్లు? సంతాపం ప్రకటించే చోట ఇలా షో పుటప్ చేయడేమిటి! అన్పించింది. ఎంతమంది బౌన్సర్లను వెంటేసుకొని వస్తే అంత గొప్ప అనుకొంటున్నారేమో అన్పిస్తుంది. వ్యాపారవేత్త అదాని కూడా అంతే. అదాని వెంట ఇంగ్లీషు సినిమాల్లోని విలన్లు చుట్టూ ఉన్నట్లుగా నల్ల కళ్లద్దాలు పెట్టుకొన్న ఫుల్‌సూట్ కమెండోలు కన్పిస్తారు. విజయ్ మాల్యా చుట్టూ అలాగే ఉండేవారు. బౌన్సర్లు, చుట్టూ ఉన్న వారిని దుర్మార్గంగా నెట్టేయడం సాధారణమైంది. 'పుష్ప 2' సినిమా ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్లో జరిగిందదే. పోలీసులు ఆ దురంతంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన మహిళ కుటుంబానికి 25 లక్షలతో పాటు బాలుని చికిత్స ఖర్చులు తాను భరిస్తానని 'పుష్ప2' హీరో అల్లు అర్జున్ ప్రకటించారు. పోలీసులు చేస్తున్న దర్యాప్తు ఫలితం ఎలా ఉన్నా సెలబ్రిటీలు, బడా వ్యాపారుల చుట్టూ ఉండే బౌన్సర్లకు ఒక నియమావళి అంటూ రూపొందించడం అవసరం.

/ వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు,
సెల్ : 9989716311 /

# సమాఖ్య స్ఫూర్తితో ఆర్థిక కేటాయింపులు

- 16వ ఆర్థిక సంఘానికి కేరళ వినతి
- కేంద్రం తోడ్పాటువుంటేనే రాష్ట్రాల ప్రగతి



పనగారియా బృందానికి స్వాగతం పలుకుతున్న కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్

**ప్రజాశక్తి ప్రతినిధి - తిరువనంతపురం**

దేశ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించే బృహత్తర బాధ్యత 16వ ఆర్థిక సంఘానిదని, అలాంటి బాధ్యతను సమాఖ్య స్ఫూర్తికి విఘాతంగా కలగకుండా నిర్వర్తించాలని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సంతృప్తికర తోడ్పాడు ఉంటేనే రాష్ట్రాల ప్రగతి సాధ్యమని ఆయన తెలిపారు. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని బృందం కేరళలో పర్యటిస్తోంది. తొలి రోజైన మంగళవారం ఆర్థిక సంఘం బృందానికి బాలగోపాల్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళకు నిధుల కేటాయింపుల్లో న్యాయం చేయాలని విన్నవించారు. 'కేరళ అభివృద్ధి నమూనా' కింద రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన వివరించారు. ఈ విజయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లభించిన పురస్కారాలు, ప్రశంసలు గురించి గుర్తు చేశారు. అయితే మౌలిక వసతుల అభివృద్ధిలో కేరళ సాధించాల్సింది ఇంకా చాలా ఉందని, ఇందుకు కేంద్రం, ఆర్థిక సంఘం సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఉన్నత విద్య, పరిశోధన వంటి రంగాల్లో చేయాల్సింది చాలా వుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వున్నప్పటికీ ఈ అంతరాలను పూడ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటూనే వుందని చెప్పారు. 10 నుండి 15వ ఆర్థిక సంఘం వరకు కేంద్రం నిధుల్లో కేరళ వాటా తగ్గిపోవడాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 10వ ఆర్థిక సంఘంలో 3.88 శాతం వాటా రాగా 15వ ఆర్థిక సంఘం నాటికి అది 1.92 శాతానికి పడిపోయిందన్నారు. పర్యావరణ విపత్తుల వల్ల ఆర్థికంగా ఎన్ని ఎదురు దెబ్బలు రాష్ట్రాభివృద్ధి కోసం కేరళ ప్రభుతవం కృషి చేస్తోందని, ఇందుకు కేంద్రం కూడా చేయూతనందించాలని కోరారు. ప్రకృతి విపత్తుల వేళ ఆర్థికంగా ఆదుకోవాల్సిన కేంద్రం ఆ పని చేయడం లేదన్నారు. 16వ ఆర్థికసంఘంగానైనా కేరళకు ఆర్థిక కేటాయింపులు విషయంలో న్యాయం చేయాలని కోరారు. అభివృద్ధి వికేంద్రీకరణలో కేరళ ఆదర్శనీయమైన కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులను అందచేయడంలోనూ, వారి కార్యకలాపాలను వికేంద్రీకరించడంలోనూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేరళ ముందుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక, ద్రవ్యపరమైన ఆందోళనలను పరిష్కరించాల్సిందిగా కోరారు. అభివృద్ధి ప్రాధాన్యతలను అమలు చేయాల్సిందిగా కోరుతూ 16వ ఆర్థిక సంఘం సభ్యులకు బాలగోపాల్ మెమోరాండాన్ని అందచేశారు.

# ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యా సిద్ధం

- క్రెమ్లిన్ అధికార ప్రతినిధి వెల్లడి

**మాస్కో :** ఉక్రెయిన్‌లో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. ఈ మేరకు రష్యా అధ్యక్ష భవనం (క్రెమ్లిన్) అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు రష్యా సంసిద్ధంగా వుందని తెలిపారు. శాంతి చొరవలను ముఖ్యంగా ప్రపంచ పేద దేశాలు, బ్రిక్స్ భాగస్వామ్య దేశాలు చేపట్టిన చొరవలను దిమిత్రి స్వాగతించారు. ఉక్రెయిన్‌పై చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగానే వున్నామని రష్యా పదే పదే చెబుతూనే వుందని, కానీ ఉక్రెయిన్ చర్చలకు సిద్ధపడటం లేదని, తమ ప్రతిపాదనలను తిరస్కరిస్తూవస్తోందని ఆయన గుర్తు చేశారు.





# జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌తో బృందాకరత్ భేటీ

**రాంచీ :** జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌తో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మతతత్వ శక్తులను ఓడించి లౌకిక శక్తులు ఘన విజయం సాధించిన సందర్భంగా హేమత్ సోరేన్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో బృందాకరత్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ విప్లవ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రఫుల్ లిండా, సమీర్ దాస్, సంజయ్ పాశ్వన్ కూడా పాల్గొన్నారు.

**జార్ఖండ్ స్పీకర్‌గా రవీంద్రనాథ్ మహతో**

జార్ఖండ్ అసెంబ్లీ స్పీకర్‌గా జెఎంఎం ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ మహతో వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి నేతగా ఆయన నిలిచారు. సోమవారం నుంచి జార్ఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండో రోజున సమావేశాల్లో స్పీకర్‌గా మహతో పేరును ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రతిపాదించారు. జెఎంఎం ఎమ్మెల్యే మధుర ప్రసాద్ మహతో బలపర్చారు. సంతాల్ పరగణాల డివిజన్‌లోని నాలా అసెంబ్లీ నుంచి ఇటీవల ఎన్నికల్లో మహతో విజయం సాధించారు. 2005లో తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన 2009 ఎన్నికల్లో మినహా 2014, 2019ల్లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత అసెంబ్లీలోనూ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

# కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ మృతి



**బెంగళూరు :** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఎస్ఎం కృష్ణ (92) ఇకలేరు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారు జామున తన నివాసంలో మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. కర్ణాటక ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. ఆయన అంత్యక్రియలు బుధవారం పూర్తి అధికారిక లాంఛనాలతో స్వంత జిల్లా అయిన మాండ్యలో స్వగ్రామంలో జరగనున్నాయి. వృద్ధాప్యం కారణంగా క్రియాశీల రాజకీయాల నుండి వైదొలగుతున్నట్లు 2023 జనవరిలో ప్రకటించారు. తన రాజకీయ జీవితంలో ఆయన పలు పదవులను అధిష్టించారు. కాంగ్రెస్‌తో 50ఏళ్ల అనుబంధాన్ని విడనాడి 2017లో బిజెపిలో చేరారు. అంతకుముందు ఆయన ప్రజా సోషలిస్టు పార్టీలో వుండేవారు. ఐటి రంగంలో బెంగళూరును గ్లోబల్ మ్యాప్‌లోకి తీసుకెళ్ళిన నేతగా ఆయనకు పేరుంది. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే దేశవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తాయి. ప్రధాని నరేంద్రమోడీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్, ఆంధ్ర, తెలంగాణా ముఖ్యమంత్రుల సహా పలువురు ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలియచేశారు.

# ఎట్టకేలకు బోనెక్కిన నెతన్యాహు

- అవినీతి కేసులో కోర్టు విచారణకు హాజరు



కోర్టులో నెతన్యాహు

**టెల్ అవీవ్ :** యుద్ధోన్మాద దాడులతో, నియంతృత్వ పోకడలతో రెచ్చిపోతున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు ఎట్టకేలకు బోనెక్కాల్సివచ్చింది. అయితే యుద్ధనేరాలకు సంబంధించిన కేసులో కాదు. అవినీతి మకిలీ పులుముకున్న నేరాభియోగాలపై ఆయన కోర్టు బోనెక్కాల్సివచ్చింది. తనపై వచ్చిన అవినీతి అభియోగాలకు సంబంధించి తొలిసారిగా నెతన్యాహు విచారణకు హాజరయ్యారు. ఇతర సాక్షుల మాదిరిగానే నెతన్యాహుకు కూడా కొన్ని సదుపాయాలు వుంటాయని, ఆయన కూర్చుని లేదా నిల్చుని ఎలాగైనా సాక్ష్యమివ్వవచ్చని న్యాయమూర్తుల్లో ఒకరు తెలిపారు. అవినీతి, విశ్వాస ఉల్లంఘన, ముడుపులు స్వీకరించడం ఇలా మూడు వేర్వేరు కేసుల్లో ఆయనపై విచారణ జరగనుంది. కిక్కిరిసిన కోర్టు గదిలోకి వచ్చిన నెతన్యాహు చాలా సాధారణంగా కనిపించారు. తనకు తన కుటుంబానికి సంబంధించిన వార్తలను సానుకూలంగా ప్రచురించినందుకు ప్రతిఫలంగా మీడియా పెద్దలకు నిబంధనల్లో సడలింపులు ఇచ్చారని కూడా ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హాలీవుడ్ నిర్మాత వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాల కోసం సహకరించినందుకు ప్రతిగా వేలాది డాలర్ల విలువైన సిగార్లు, షాంపేన్‌లు ముడుపులుగా అందుకున్నారని అభియోగాలున్నాయి. అయితే తానెలాంటి తప్పులు చేయలేదని నెతన్యాహు వాదిస్తున్నారు. ఇవన్నీ తనకు వ్యతిరేకంగా వుండే మీడియా పన్నిన కుట్రలుగా పేర్కొన్నారు. తన సుదీర్ఘ కాల పాలనకు తెర దించేయాలనే లక్ష్యంతోనే కక్ష సాధింపుతో ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. అయితే గాజాలో దాడుల కారణంగా అంతర్జాతీయంగా నెతన్యాహుపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అలాగే అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఆయన అరెస్టుకు వారంట్లు జారీ చేసింది. ఇటువంటి సమయంలో నెతన్యాహు ఈ విచారణను ఎదుర్కొనాల్సిరావడం గమనార్హం.



# ధన్‌ఖర్‌పై అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా పడ్డాయి. తిరిగి ప్రారంభమైన సభలో మార్పు ఏమీ లేదు. దీంతో నిమిషాల వ్యవధిలోనే నేటీకి వాయిదా పడ్డాయి. ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం ప్రియాంక గాంధీ విలేకరులతో మాట్లాడుతూ అదానీ అంశంపై చర్చకు బిజెపి భయపడుతోందని అన్నారు. "నేను పార్లమెంటుకు కొత్త సభ్యురాలిని. కానీ ఇప్పటి వరకు పార్లమెంటులో ప్రధానమంత్రి కనిపించలేదు. మనం ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తకూడదు?" అని అన్నారు.

**అదానీ ముడుపుల వ్యవహారం తేల్చాల్సిందే**

అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జెపిసి)తో విచారణ జరిపించి, నిజనిజాలు తేల్చాల్సిందేనని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారమైన మకర ద్వార్ మెట్ల ముందు 'మోడీ-అదానీ' క్యారీక్యాచర్లతో కూడిన బ్యాగులతో ఆందోళన చేపట్టారు. ఒకవైపు మోడీ-మరోవైపు అదానీ బొమ్మలు, బ్యాగ్ వెనుక వైపు 'మోడీ-అదానీ భాయ్ భాయ్' అని రాసి ఉంచారు. మోడీ-అదానీ కుమ్మక్కు అయ్యారని ఆరోపిస్తు పెద్ద ఎత్తున నినాదాల హెూరెత్తించారు.

ఈ ఆందోళనలో కాంగ్రెస్, డిఎంకె, జెఎంఎం, సిపిఎం, సిపిఐ, శివసేన, ఆర్‌జెడి, ఎన్‌సిపి తదితర పార్టీలు ఎంపిలు పాల్గొన్నారు. ఈ ఆందోళనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, డిఎంకె ఎంపి కనిమొళి, జెఎంఎం ఎంపి మహువా మాంఝీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ తదితరులు పాల్గొన్నారు.

# కెఎం తివారీ ఇకలేరు

(మొదటి పేజీ తరువాయి)

శ్వాస కోశ సంబంధ సమస్యలతో తూర్పు ఢిల్లీలోని ధర్మశిలా ఆసుపత్రిలో చేరారు. ఆయనను వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగా తుదిశ్వాస విడిచారు. తివారీ రాజకీయ జీవితం ఘజియాబాద్-సాహిబాబాద్ పారిశ్రామిక బెల్ట్‌లో మొదలైంది. సిఐటియు ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా, జనరల్ కౌన్సిల్, వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఆయన పలు బాధ్యతలు నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం నిబద్ధతతో పోరాడారు.

1977లో సిపిఎంలో చేరిన తివారీ 1988లో ఢిల్లీ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1991లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2018లో కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2017 నుండి 2024 వరకు ఆయన ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఘజియాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎన్‌సిఆర్ ప్రాంతంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. తివారీ మూడు నెలలకు పైగా జైలు జీవితం గడిపారు. రాజకీయ పోరాటంలో మూడు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు అజ్ఞాతవాసంలో ఉన్నారు. కార్మిక ఉద్యమానికి తివారీ చేసిన కృషి, కమ్యూనిస్ట్ లక్ష్యం పట్ల ఆయన నిబద్ధత అంకితభావం గుర్తుండిపోతాయని సిపిఎం శ్రేణులు చెబుతున్నారు.

ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఘజియాబాద్ పార్టీ కార్యాలయానికి, అటు పిమ్మట న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌కు తీసుకెళ్లనున్నారు. అంత్యక్రియలు బుధవారం ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని నిగమ్‌బోద్ ఘాట్‌లో నిర్వహించనున్నారు.

**కెఎం తివారీకి సిపిఎం పొలిట్ బ్యూరో నివాళి**

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు, పార్టీ ఢిల్లీ రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కామ్రేడ్ కెఎం తివారీ మరణం పట్ల సిపిఎం పొలిట్ బ్యూరో తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. గత కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన మంగళవారం ఉదయం కన్నుమూశారని తెలిపింది. ఈసందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు పొలిట్‌బ్యూరో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.



### మీకోసం

పన్నీరు ముక్కలను నీటిలో ఉడకబెట్టకుండా, కాసేపు వేడి నీటిలో ఉంచి తీస్తే మెత్తగా ఉంటాయి.

### జీవన సౌరభం

అసమర్థులకు అవరోధాలుగా కనిపించేవి సమర్థులకు అవకాశాలుగా కనిపిస్తాయి.



## నేనొక కుక్కను పెంచాను



నేనొక కుక్కను పెంచాను
దానికి పాలు పోసాను
నేనొక మొక్కను పెంచాను
దానికి నీళ్ళు పోసాను

నేనొక బొమ్మను గీచాను
అమ్మకు దాన్ని చూపాను
నేనొక టోపీ కుట్టాను
నాన్నకు దాన్ని పెట్టాను

నేనొక రిబ్బన్ కొన్నాను
అక్కకు దానిని యిచ్చాను
నేనొక 'స్టిక్కు'ను తెచ్చాను
తాతకు ఊతగ యిచ్చాను

నేనొక ఆపిల్ తెచ్చాను
టీచర్ కేమో యిచ్చాను
హేపీబర్తు డే అంటూ
టీచర్ నన్ను దీవించె !

స్నేహితులంతా వచ్చారు
షేక్ హాండునే యిచ్చారు
శుభాకాంక్షలు చెప్పారు
పండ్లను వారికి యిచ్చాను

డబ్బులు ఎక్కడివంటారా
డిబ్బిలోన దాచాను
అమ్మ,నాన్న యిచ్చినవి
అందులోన నే వేసాను

అమ్మకు ముద్దు పెట్టాను
నాన్న నడుము చుట్టాను


అక్కతో ఆటలాడాను
తాతతో మాటలాడాను

కుక్కను ఎత్తుకున్నాను
మొక్కకు ఎరువును వేసాను!
పలకా బలపం తీసాను
అఆ ఇఈ రాసాను!

– కిలపర్తి దాలినాయుడు
సాంఘిక శాస్త్రోపాధ్యాయుడు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రామభద్రపురం

### లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.




జవాబు : 100

### నేను గీసిన బొమ్మ





బి.యమున,
ఎంపిపిఎస్ మెయిన్,
చిల్లకల్లు, జగ్గయ్యపేట,
ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# అప్రమత్తతోనే 'ఈ' నేరాలు ఆగేది..

**వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలీగ్రామ్ ... ఇలాంటి సోషల్ మీడియా ఖాతాలు మీరు వాడుతున్నారా? అయితే బహుపరాక్... సైబర్ నేరగాళ్లు ఉన్నారు జాగ్రత్త.. అనునిత్యం మీ కదలికలు, ఆయా ఖాతాలను, పోస్టులను ఫాలో అవుతూ మీ వ్యక్తిగత వివరాలను తెలుసుకుంటూ ఆనక బ్లాక్‌మెయిలింగ్‌కు దిగే ముఠాలు ఉన్నాయి. ఫేక్ ఖాతాలు ప్రారంభించి ఆడవాళ్ల ఫొటోలను ఐడిలకు పెట్టుకుంటూ చాటింగ్‌లు చేస్తారు. ఆ వలలో చిక్కుకుంటే- అసలు రూపం బయట పెడతారు. బీ కేర్ ఫుల్.. మీ వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, బ్యాంకు ఖాతాల వివరాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. అవగాహనతోపాటుగా అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ నేరాల బారి నుంచి బయటపడొచ్చు.**



అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రక రకాల మెసేజ్‌లతో సైబర్ నేరగాళ్లు పంజా విసురుతున్నారు. మొదట్లో ఆడవాళ్ల నుంచి స్వీట్ వాయిస్‌తో మాట్లాడతారు. ఆ తర్వాత బాతాఖానీ చేస్తారు. ఆ తర్వాత మెల్లగా మాటల్లోకి దింపి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తుంటారు. అంతర్ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి ఈ సైబర్ నేరాలు జరుగుతున్నాయి. నిరంతరం సోషల్ మీడియా వేదికలను పరిశీలిస్తూ వారి వ్యక్తిగత డేటాను తెలుసుకుంటూ మెల్లగా ఇలాంటి సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. ఎందుకంటే అంత దూరం బాధితులు రాలేరని వారి భావన. ఈజీమనీ కోసం ఇలాంటి కేటుగాళ్లు మన పరిసర ప్రాంతాల్లో కూడా ఉండొచ్చు. ఎక్కడో ఒకచోట వ్యక్తిగతంగానూ, లేదా బృందాలుగా కొంతమంది వ్యక్తులు ఇలా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఆంధ్రా, తెలంగాణాలో కూడా సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ వ్యవస్థలు పెద్ద ఎత్తున కృషిచేస్తున్నాయి. సైబర్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు, బాధితులకు అండగా ఉండేందుకు కృషి జరుగుతోంది.

ఆన్‌లైన్ చదువులు, ఉద్యోగాలు, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఆశచూపి ఈ మోసాలకు తెగబడుతున్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో నిస్సహాయులుగా మార్చి రూ.లక్షల్లో లాగేసుకుంటున్నారు. బాధితులు తెలుసుకునే లోపే వారి కష్టార్జితం కొల్లగొట్టేస్తున్నారు. రాష్ట్రంలో పలు చోట్ల ఐవిఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) కాల్స్ ద్వారా ఎరవేసి డబ్బులు దోచేస్తుండటం వెలుగులోకి వస్తోంది. బాధితులు కళ్ల తెరిచే సరికే డబ్బు ఖాతాలు దాటిపోతోంది.

పోలీస్‌శాఖ ద్వారా ప్రధానంగా నాలుగు పద్ధతుల్లో సైబర్ నేరాల నియంత్రణకు కృషిచేస్తున్నాం.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించటం
బాధితులకు అండగా ఉండటం
నిపుణులతో భాగస్వామ్యంతో పనిచేయటం
సాంకేతిక సృజనతో నేరాల మూలాలు కనుగొనటం

**అవగాహన ముఖ్యం**

మా శాఖ ద్వారా సామాన్య ప్రజానీకం నుంచి అన్ని తరగతుల ప్రజలకు సైబర్ నేరాలు జరిగేందుకు ఉన్న అవకాశాలు ఎలాంటివో తెలియజేస్తున్నాం. అవగాహన లేమి కారణంగానే బాగా ఉన్నత చదువులు చదివిన వారు, డాక్టర్లు, ఇంజనీర్లు, చార్టెర్డ్ అకౌంటెంట్లు, ఇతర వివిధ వృత్తుల వారు బాధితులుగా మారుతున్నారు. ఉదా : ప్రభుత్వ బ్యాంకుల నుంచి ఓటీపీలు చెప్పమని ఫోన్లు రావు. నేరగాళ్ల నుంచే 'మీ ఖాతా ఉన్న బ్యాంకు కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ సేవింగ్, కరెంట్ అకౌంట్ల గురించి అప్‌గ్రేడేషన్ చేస్తాన్నామం'టూ ఫోన్లు వస్తుంటాయి. వారి ప్రశ్నలకు జవాబులు చెప్పటం, ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పడం వల్ల సైబర్ దొంగలు ఈజీగా ప్రతిరోజూ రూ.లక్షల్లో కాజేస్తున్నారు. అందువల్ల అపరిచిత వ్యక్తులకు సమాధానం ఇవ్వటాన్ని మానుకోవాలి. వ్యక్తిగత గోప్యతకు భంగం కల్గించే అంశాల పట్ల జాగురూకతతో ఉండాలి.

**బాధితులకు అండగా :** ఇలాంటి మోసాలకు గురైనప్పుడు cybercrime@gmail.com లేదా 1930 ద్వారా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. సైబర్ నేరం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో policestation/http://cyber-crime.gov.inలో రిపోర్టు చేయటం ముఖ్యం. సంఘటన జరిగిన గంట సమయంలోపుగా పోలీసులకు తెలియజేస్తే కొంతమేరకు నిరోధించే అవకాశం, ఛేధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఇటీవలకాలంలో టెక్నాలజీని ఉపయోగించి చాలా కేసులను ఛేదించటం జరుగుతోంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి నిందితులను గుర్తించటంతోపాటుగా, సొమ్ము రికవరీ చేయటం, అరెస్ట్ చేసిన ఉదంతాలు కూడా చాలా ఉన్నాయి.

**నిపుణుల భాగస్వామ్యంతో ...**



పోలీసుశాఖతోపాటుగా ఇతర సాంకేతిక నిపుణుల సహాయాన్ని కూడా తీసుకుని సైబర్ నేరాల నియంత్రణకు కృషిచేస్తున్నాం. సైబర్ సిటిజన్ అప్లికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందరూ అందులో చేరేలా కృషి జరుగుతుంది. ఈ యాప్‌లో చేరిన వారికి ఏది అసలు ఫోన్‌కాల్, ఏది నకిలీ, అపరిచత వ్యక్తులు, యాప్స్, లింక్స్ వంటి వాటిని గుర్తించటానికి అవకాశం ఉంటుంది. ఎపి పోలీస్ ద్వారా డయల్ 100, 1930 ద్వారా కంప్లెయింట్ రిజిస్టర్ చేస్తున్నాం. ఆ తర్వాత టెక్నాలజీని ఉపయోగించి సైబర్ కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయి. నిందితులు ఎవరు వంటివి గుర్తించే పక్రియలు చేపడుతున్నాం. పలు దశల్లో ఈ ప్రక్రియలను కొనసాగిస్తున్నాం.


**–ఎస్.వి.రాజశేఖరబాబు,**
**ఎన్‌టిఆర్ జిల్లా**
**పోలీస్ కమిషనర్**

### తగు జాగ్రత్తలతో మోసాలకు ముకుతాడు

- టెక్నాలజీని ఉపయోగించే సైబర్ దొంగలు మోసాలకు పాల్పడుతున్నారు. వీటిని నిరోధించేందుకు కూడా అధునాతన సాంకేతిక సృజనను ఉపయోగించి ఆయా కేసులను ఛేధించటానికి కృషి జరుగుతోంది. మా శాఖ ద్వారా సైబర్ నిపుణులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఫోను వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే చాలా మోసాలను మొదట్లోనే నియంత్రించొచ్చు.
- మీకు పార్శిల్ పంపించారనీ, అందులో డ్రగ్స్, ఆయుధాలు ఉన్నాయంటూ కేసు నమోదు చేశామని కాల్ చేస్తే స్పందించొద్దు. తక్కువ వడ్డీకి ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా లోన్ ఇస్తామని చెప్పే లోన్ యాప్‌లను నమ్మొద్దు. పార్ట్‌టైమ్, వర్క్‌ఫ్రం హోమ్ అంటూ ప్రొడక్ట్స్, హోటళ్లకు రేటింగ్, లైక్స్ ఇవ్వటం ద్వారా డబ్బులు వస్తాయని చెప్పే యాప్స్, వెబ్‌సైట్లను నమ్మొద్దు.
- పాస్‌వర్డ్‌లను అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక చిహ్నాలు కలిపి ఉండేలా బలమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోండి. తరచుగా వాడుతున్న పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండండి. కంప్యూటర్, మొబైల్‌ఫోన్, ఇతర పరికరాలను, సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు యాంటీవైరస్ ఉపయోగించి అప్‌డేట్ చేసి మాల్‌వేర్‌లను రానివ్వకుండా చూసుకోండి. అనుమానాస్పద వీడియో కాల్స్, లింక్స్, ఎపికె ఫైల్స్, యాప్స్ మాల్స్, మెసేజ్‌లను తెరవడం ద్వారా మీ ఫోన్ సైబర్ కేటుగాళ్ల చేతుల్లోకి అందించకండి.
- సోషల్ మీడియా యాప్‌లో ప్రొఫైల్ లాక్‌తోపాటు టు స్టెప్ వెరిఫికేషన్ పాస్వార్డ్‌లను పెట్టుకోండి. అనుమానాస్పద లింక్స్, ఎపికె ఫైల్స్ , యాప్స్ డౌన్‌లోడ్ కాకుండా మీ ఫోన్ సెక్యూరిటీ సెట్టింగ్స్ 'ఆన్'లో ఉంచండి. రైల్వేస్టేషన్, బస్టాండ్, ఇతర పబ్లిక్ స్థలాల్లో వైఫైను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోండి. సెల్‌కు సొంత చార్జర్‌ను మాత్రమే వాడండి. ఫోన్ పే, గూగుల్‌పే, స్కానర్‌ల ద్వారా పేమెంట్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. మీ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పంచుకోకూడదు.

# సిరియాపై దురాక్రమణకు యత్నం

- ఇజ్రాయిల్ బరితెగింపు
- 48 గంటల్లో 250కి పైగా వైమానిక దాడులు
- గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌లోకి ఇజ్రాయిల్ చొరబాటు
- ఖండించిన అరబ్ ప్రపంచం



సిరియా సరిహద్దు 'అల్ఫా రేఖ' వద్ద యుద్ధ ట్యాంకులతో ఇజ్రాయిల్ సైన్యం

**డమాస్కస్ :** తిరుగుబాటు అనంతరం సిరియాలో నెలకొన్న అనిశ్చితిని ఆసరా చేసుకుని ఇజ్రాయిల్ ఆ దేశంపై దురాక్రమణపూరిత దాడులకు పూనుకుంది. సిరియాకు చెందిన గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌ను కబళించేందుకు ఇజ్రాయిల్ సైన్యం ఆ ప్రాంతంలోకి చొరబడింది. రసాయనిక ఆయుధాలు ఉన్నాయని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ గొలాన్ హైట్స్ పై పెద్దయెత్తున వైమానిక దాడులకు పాల్పడుతోంది. సిరియా నౌకలను, మిలటరీ గోదాములను ధ్వంసం చేసింది. రాజధాని డమాస్కస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశోధనా కేంద్రాలు, మిలటరీ ప్రాంతాలపై కూడా దాడులు చేస్తోంది.

అసద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత ఇజ్రాయిల్, గోలన్ హైట్స్‌పై దండెత్తింది.గడచిన 48గంటల్లో దాదాపు 250 వైమానిక దాడులు జరిపినట్లు ఎస్ఓహెచ్ఆర్ తెలిపింది. ఇది పరిమితమైన, తాత్కాలిక చర్యగా ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు.

**ఖండించిన అరబ్ దేశాలు**

సిరియా గోలన్ హైట్స్‌లోని నిస్సైనికీకరణ మండలాన్ని స్వాధీనం చేసుకున్న ఇజ్రాయిల్ చర్యలను అరబ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ దాడులు, 1974 నాటి ఒప్పందాన్ని దారుణంగా ఉల్లంఘించడమేనని ఈజిప్ట్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా సిరియా ప్రాదేశిక సమగ్రతను దారుణంగా దెబ్బతీశారని పేర్కొంది. ఈ దాడులపై తక్షణమే నిర్దిష్ట వైఖరి తీసుకోవాలని భద్రతా మండలిని కోరింది. సిరియాలో శాంతి, సుస్థిరత పునరుద్ధరణకు గల అవకాశాలను దెబ్బతీసేలా ఇజ్రాయిల్ దాడులు ఉన్నాయని సౌదీ అరేబియా పేర్కొంది. ఇదొక ప్రమాదకరమైన పరిణామమని కతార్ విమర్శించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ అనుసరించే ఇటువంటి విధానాల వల్ల ఈ ప్రాంతంలో మరింత హింస పెచ్చరిల్లుతుందని హెచ్చరించింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలను, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయిల్ బాహాటంగా ఉల్లంఘిస్తోందని కువైట్ విమర్శించింది. సిరియాపై ఇజ్రాయిల్ దురాక్రమణ తమకెంత మాత్రమూ సమ్మతం కాదని జోర్డాన్ పేర్కొంది. గొలాన్, దాని చుట్టుపక్కల ప్రాంతాలతో కూడిన బఫర్ జోన్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాక్ ఖండించింది. దురాక్రమణదారు ఇజ్రాయిల్ చర్యలను అరబ్ లీగ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది.

**రాజీనామా ఆయన స్వంత నిర్ణయమే : క్రెమ్లిన్**

పదవికి రాజీనామా చేయాలన్న నిర్ణయం అసద్ స్వంతమేనని అందులో రష్యా పాత్ర ఏమీ లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు. శని, ఆదివారాల్లో సిరియాలో తిరుగుబాటు దళాలు దేశంలోని కీలక ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకోవడంతో అసద్ అధికారికంగా రాజీనామా చేసి కుటుంబంతో కలిసి మాస్కో వచ్చేశారు. రష్యాలో అసద్‌కు ఆశ్రయం కల్పించామని ఇప్పటికే మాస్కో ప్రకటించింది. అసద్ ఈ నిర్ణయం తీసుకునేలా మాస్కో ప్రభావితం చేసిందా అని విలేకర్లు ప్రశ్నించగా, దానికి పెస్కోవ్ పై విధంగా స్పందించారు.

# తొలగని ఉత్కంఠ

- గుకేశ్-డింగ్ పాయింట్లు సమం
- నేడు 13వ రౌండ్
- ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్




**సింగపూర్:** ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌పై ఇంకా ఉత్కంఠ తొలగలేదు. 12 రౌండ్‌ల గేమ్ ముగిసేసరికి ఇరువురు 6-6పాయింట్లతో సమంగా ఉన్నా.. బుధవారం జరిగే 13వ రౌండ్ గేమ్‌తో టైటిల్‌పై ఆధిపత్యం ఎవరిదో తేలిపోనుంది. ప్రస్తుతానికి ఇరువురు 6-6పాయింట్లతో ఉన్నారు. దీంతో ఫిడే ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్ నయా ఛాంపియన్ ఎవరో అనేది రసకందాయంలో పడింది. నేడు జరిగే చివరి రౌండ్ గేమ్‌లో గెలిచిన గ్రాండ్‌మాస్టర్‌కు టైటిల్ దక్కనుంది. బుధవారం జరిగే 13వ రౌండ్ గేమ్‌లో 13ఏళ్ల గుకేశ్ తెల్లపావులతో బరిలోకి దిగనున్నాడు. దీంతో అతడికి ఈ రౌండ్‌లో విజయావకాశాలు మెండుగా ఉంటాయి. ఈ రౌండ్‌లో డింగ్ నల్లపావులతో బరిలోకి దిగాల్సి ఉంటుంది. చివరి రౌండ్ గేమ్‌లో డింగ్ లెరెన్ తెల్లపావులతో, గుకేశ్ నల్లపావులతో ఆడనున్నారు. ఈ గేమ్ డ్రా అయిన పక్షంలో ఫలితం కోసం టైబ్రేకర్ పోటీ జరగనుంది. చివరి 14వ రౌండ్‌తో విజేత ఎవరో తేలిపోనుండగా.. ఫిడే నిబంధనల ప్రకారం 7.5పాయింట్లు సాధించిన తొలి ఆటగాడు విజేతగా అవతరించనున్నాడు. 14వ గేమ్ ముగిసేసరికి పాయింట్ల పరంగా ఇరువురు గ్రాండ్‌మాస్టర్లు సమంగా ఉన్న పక్షంలో టైబ్రేకర్‌కు వెళ్లనున్నారు. డ్రా అయిన పక్షంలో ఇరువురికి అర పాయింట్ చొప్పున, ఆ రౌండ్‌లో గెలిచిన గ్రాండ్‌మాస్టర్‌కు ఒక పాయింట్ దక్కనుంది.

**అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న గుకేశ్...**

భారత్‌కు చెందిన 18ఏళ్ల డి. గుకేశ్.. చైనా గ్రాండ్‌మాస్టర్, డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లెరెన్‌కు ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. భారత యువ గ్రాండ్ మాస్టర్‌తో 32ఏళ్ల డింగ్.. టైటిల్‌ను నిలబెట్టుకొనేందుకు చెమటోడ్చాల్సి వస్తుంది. 2023లో తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకు డింగ్ లెరెన్.. రష్యాకు చెందిన నెపోమ్ని యాచిని ఓడించి నయా ఛాంపియన్‌గా అవతరించాడు.

### జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలపై సుప్రీం ఆరా

- వివరాలు ఇవ్వాలని అలహాబాద్ హైకోర్టుకు ఆదేశం

**న్యూఢిల్లీ :** విహెచ్‌పి కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక అందచేయాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. ఈ నెల 8న విహెచ్‌పి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ యాదవ్ ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) సమర్ధిస్తూ వ్యాఖ్యానించడంతో పాటు పరోక్షంగా ముస్లింలపై విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. 'మన పిల్లలకు పుట్టినప్పటి నుంచి దయ, సహనం అలవాటు చేస్తాం. వాళ్ల పిల్లల ముందే జంతువులను వధిస్తారు. అలాంటప్పుడు వారికి దయ, సహనం ఎలా అలవడతాయని' అంటూ ఆయన పేర్కొన్నారు. ఇది హిందూదేశమని, మెజారిటీ ప్రజలు అనుకున్నట్టుగానే భారత్ నడుస్తుందని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# ఆర్థిక చోదకశక్తిగా చైనా

- ప్రపంచ ఆర్థిక సంస్థల అధినేతల సమావేశంలో జిన్‌పింగ్

**బీజింగ్ :** ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను ఈ ఏడాది కూడా సాధించడం ద్వారా ప్రపంచ ఆర్థికాభివృద్ధికి అతిపెద్ద చోదకశక్తిగా తాము నిలవనున్నామని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అధినేతలతో మంగళవారం బీజింగ్‌లో నిర్వహించిన '1 ప్లస్ 10' చర్చల సందర్భంగా ఆయన ప్రసంగించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అధ్యక్షులు దిల్మా రౌసెఫ్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివివా, ప్రపంచ బ్యాంకు గ్రూప్ అధ్యక్షులు అజయ్ బంగా, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) డైరెక్టర్ జనరల్ నగోజి ఒకొంజో ఐవెలా సహ పది అగ్రశ్రేణి ప్రపంచ ఆర్థిక సంస్థల అధినేతలు ఏకకాలంలో ఈ చర్చల్లో పాల్గొన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ మూడో ప్లీనరీ సెషన్ దృష్టి సారించిన అంశాలను ఈ సందర్భంగా జిన్‌పింగ్ తెలియజేశారు. ప్రత్యేకించి చైనా ఇటీవల తీసుకొచ్చిన ప్రధాన విధానపర నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. 40 ఏళ్ల సుస్థిర, పురోగామి అభివృద్ధి అనంతరం చైనా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన అభివృద్ధి సాధించే లక్ష్యాలపై దృష్టి సారించిందన్నారు. ప్రపంచ వాణిజ్య ప్రగతిలో చైనా ఒక్కటే 30 శాతం వాటాతో చోదకశక్తిగా నిలిచిందన్నారు. బయట ప్రపంచానికి చైనా మరింతగా తలుపులు తెరవనుందన్నారు. వాణిజ్య రంగంలో మరిన్ని అవకాశాలు కల్పించి, ఆదాయాలు, లాభాలను ఇతర దేశాలతో కలసి పంచుకోవటానికి ఏమాత్రం వెనుకాడబోమని జిన్‌పింగ్ చెప్పారు. స్థిరమైన, ఆరోగ్యకరమైన, సుస్థిరాభివృద్ధి సాధించే క్రమంలో విభేదాల పరిష్కారానికి అమెరికా ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలకు, సహకార విస్తృతికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే తరహాలో చైనాతో కలసి పని చేసేందుకు అమెరికా వైపు నుంచి కూడా కృషి జరగాలని చైనా కోరుకుంటుందన్నారు. వాణిజ్యం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆంక్షలు, యుద్ధాలకు తావు లేదని, ఇందులో విజేతలంటూ ఎవ్వరూ ఉండరని చైనా అధినేత ఉద్ఘాటించారు. దశాబ్దకాలంగా తాము దిగ్విజయంగా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) పురోగతి గురించి కూడా జిన్‌పింగ్ ప్రస్తావించారు.




## విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యుపిలో నిరసనలు

- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన డిస్కమ్‌ల సిబ్బంది

**నోయిడా :** ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళ వారం నోయిడా, ఘజియాబాద్‌ల్లో 4 వేలకు పైగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. పూర్వాంచల్ విద్యుత్ విత్రణ్ నిగం లిమిటెడ్ (పియువివిఎన్ఎల్), దక్షిణాంచల్ విద్యుత్ విత్రణ్ నిగం లిమిటెడ్ (డివివిఎన్ఎల్) అనే రెండు డిస్కంలను ప్రైవేటీకరణకు ఉత్తర ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (యుపిపిసిఎల్) అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు ఈ చర్యకు దిగారు. యుపి విద్యుత్ కర్మాచారి సంయుక్త సంఘర్షణ సమితి (వికెఎస్ఎస్ఎస్) నేతృత్వంలో ఉద్యోగులు నిరసనలు చేపడుతున్నారు. మరో వైపు నిరసనలు అణిచివేయడానికి యుపి ప్రభుత్వం నిరంకుశ చర్యలకు దిగుతుంది. యుపిపిసిఎల్, దాని ఐదు అనుబంధ సంస్థల ఉద్యోగులు ఆరు నెలల పాటు సమ్మెలు చేయకుండా యుపి ప్రభుత్వం నిషేధించింది. ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్ (ఎస్మా) నిబంధనల కింద ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసింది.

## హాట్ కేకుల్లా అమ్ముడైన బాక్సింగ్ డే టెస్టు టికెట్లు



**అడిలైడ్:** మెల్‌బోర్న్ వేదికగా డిసెంబరు 26 నుంచి జరగనున్న బాక్సింగ్ డే టెస్టు టికెట్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఈ స్టేడియం సామర్థ్యం లక్ష కాగా.. మ్యాచ్‌కు ఇంకా 15 రోజుల సమయం ఉన్నప్పటికీ ఇప్పటికే తొలిరోజు ఆటకు సంబంధించిన టికెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. తొలి రోజుకు సంబంధించి అందుబాటులో ఉన్న పబ్లిక్ టికెట్లన్నీ అమ్ముడైనట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. అడిలైడ్‌లో జరిగిన పింక్ బాల్ టెస్టుకు కూడా అభిమానులు పోటెత్తారు. మూడు రోజుల్లో 1,35,012 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. మొదటి రెండు రోజుల్లో రికార్డు స్థాయిలో (తొలి రోజు 50,186 మంది, రెండో రోజు 51,542 మంది) అభిమానులు స్టేడియానికి వచ్చారు. ఇక బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా మూడో టెస్టు బ్రిస్బేన్‌లో గబ్బా స్టేడియంలో జరగనుంది. డిసెంబరు 14న ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

## జైపూర్ ఖాతాలో మరో గెలుపు

**పూణే:** ప్రొ కబడ్డీ లీగ్ పోటీలు చివరి దశకు చేరే క్రమంలో ఉత్కంఠగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన లీగ్ పోటీలో జైపూర్ పింక్ ప్యాంథర్స్ 42-29పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్‌పై ఘన విజయం సాధించింది. జైపూర్ జట్టులో అర్జున్(13), నీరజ్(8) రైడ్స్‌లో రాణించగా.. అంకుష్, రేజా ట్యాకిల్స్‌లో రాణించారు. ఇక గుజరాత్ జట్టు గుమ్మన్ సింగ్(9), రాకేశ్(9) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో ఘోరంగా విఫలమైంది. జైపూర్ జట్టు 4సార్లు గుజరాత్‌ను ఆలౌట్ చేయడంతోపాటు రైడ్‌ల ద్వారా 24, ట్యాకిల్స్ ద్వారా 13పాయింట్లు సాధించింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 44-29పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది.

**ప్రొ కబడ్డీలో నేడు**
హర్యానా స్టీలర్స్ × బెంగళూరు(రాత్రి 8.00గం॥)
యు ముంబ × తమిళ్ తైలవాస్(రాత్రి 9.00గం॥)


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68